


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 10-06-2026 | సంపుటి - 29 | సంచిక -14 | రూ : 4 | పేజీలు: 8

## ప్రజా ప్రభుత్వానికి రైతుల శ్రమ తెలుసు

- కేంద్రం కొనకపోయినా ప్రతి గింజనూ కొంటుంది
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

చిల్పూర్ : 'కేంద్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొన్నా, కొనకపోయినా రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం రైతుల శ్రమను గుర్తించి చివరి గింజ వరకూ కొంటుంది. రూ.వేల కోట్లు ఖర్చు చేసి రబీ సీజన్‌లో రికార్డుస్థాయిలో 72.30 లక్షల టన్నుల ధాన్యాన్ని మా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంటే.. భారాస, భాజపా నాయకులు కల్లాలోకి వస్తామని, రైతుల కన్నీళ్లు తుడుస్తామని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది' అని ఉప ముఖ్యమంత్రి భట్టి తరువాయి 2లో

కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ..

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ

- మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ
- తెలంగాణ కోర్టు కేసు వివరాలు దాచిపెట్టారని బీజేపీ అభ్యంతరం
- ఇది కేసు కాదని, కేవలం నోటీసు మాత్రమేనని వాదించిన కాంగ్రెస్
- గాంధేయవాద మహిళను చూసి బీజేపీ భయపడుతోందని కాంగ్రెస్ నేత విమర్శ 2లో





## రాజధానిలో వర్ష బీభత్సం

- మల్కాజిగిరి వినాయక్‌నగర్‌లో 13 సెం.మీ. వాన
- గంటల తరబడి రోడ్లపై నిలిచిన వాహనాలు
- పాతబస్తీలో విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి
- నేడు 4 జిల్లాలకు భారీ వర్ష సూచన



హైదరాబాద్: హైదరాబాద్ మహా నగరంలో మంగళవారం కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. కుంభవృష్టితో దాదాపు అన్ని ప్రాంతాలు వణికిపోయాయి. అత్యధికంగా మల్కాజిగిరి వినాయక్‌నగర్ వార్డు ఆఫీసు ప్రాంతంలో 13 సెం.మీ. వర్షపాతం నమోదైంది. బన్సీలాల్‌పేట్‌లో 8.75, హిమాయత్‌నగర్ విఠల్‌వాడీలో 7.9 సెం.మీ. వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వరణుడు విరుచుకుపడటంతో నగరం అల్లాడిపోయింది. ముఖ్యంగా పాతబస్తీలో వీధిలైట్ల తీగ తెగి పడడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. చార్మినార్ సమీపంలో చెత్తబజార్‌లో పాతకాలం నాటి ఓ కమాన్ స్వల్పంగా కూలింది. అంబర్‌పేట్, ముషీరాబాద్, తదితర ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, నల్గొండ, సూర్యాపేట, నిర్మల్ తదితర జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిశాయి.

### రహదారులపై నరకం..

వాన సరిగ్గా సాయంత్రం మొదలైంది. ఆఫీసులు ముగిసే సమయానికి కుండ పోతగా తరువాయి 2లో



## అతివల చేతిలోనే ప్రగతి

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే వరకు విశ్రమించను
- వ్యాపార ప్రణాళికలు వేసుకోండి.. పెట్టుబడులిస్తాం
- స్వయం సహాయక సంఘాలకు మూడు వేల బస్సులనిస్తాం
- పంటల మార్పిడికి మహిళా సంఘాలే చొరవ చూపాలి 2లో



- అతివలను విస్మరించిన వారు.. ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు
- ఇందిరా మహిళాశక్తి మహాసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## సీఐడీ ఎంట్రీతో కలకలం..

### దీదీ సర్కార్‌కు మరో షాక్!



- ఎమ్మెల్యేల సంతకాల ఫోర్జరీ కేసులో సోదాలు
- మమత నివాసం చిరునామాతోనే పార్టీ కార్యాలయం ఉన్నందున తనిఖీలు
- అధికారులను అడ్డుకున్న తృణమూల్ నేతలు
- సమన్లకు హాజరుకాని నేత అభిషేక్ బెనర్జీ
- పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కలకలం 2లో

ఏసీబీ కి చిక్కిన

## మరో భారీ తిమింగలం


- ఆర్ అండ్ బీ ఈఎన్ సీ అక్రమాస్తులు వంద కోట్ల పైనే
- ఏసీబీ దాడుల్లో వెల్లడి



హైదరాబాద్: రాష్ట్రంలో మరో భారీ అవినీతి తిమింగలం ఏసీబీ వలకు చిక్కింది. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖలో చీఫ్ ఇంజనీరుగా పని చేస్తున్న మోహన్ నాయక్ అవినీతి అక్రమాలకు పాల్పడి దాదాపు వంద కోట్ల రూపాయలకు పైగా ఆస్తులను సంపాదించినట్టు ఏసీబీ మంగళవారం జరిపిన అకస్మిత దాడులో వెల్లడైంది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ తరువాయి 2లో

## ట్రంప్ టవర్స్‌తో కొత్త శకం

- కోకాపేటలో ప్రతిష్ఠాత్మక ట్రంప్ టవర్స్... ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్
- ఐరా, ట్రైబెకా డెవలపర్స్ సంయుక్తంగా నిర్మాణం
- ప్రీమియం 3, 4 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లతో కూడిన జంట టవర్లు
- 2031 మే నాటికి ప్రాజెక్ట్ పూర్తి చేయాలన్నది లక్ష్యం 2లో




## ఢిల్లీ అగ్నిప్రమాదం

### కుటుంబంలోని 8 మంది మృతి

- ఆసుపత్రిలో ఉన్న కుటుంబ పెద్దను చూసేందుకు వచ్చి ప్రమాదంలో చిక్కుకున్న బంధువులు 2లో
- ప్రమాదంతో గుర్గావ్ అగర్వాల్ కుటుంబంలో ఎవరూ మిగలకుండా పోయిన వైనం



# రాజధానిలో వర్ష బీభత్సం

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంలో మంగళవారం కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. కుంభవృష్టితో దాదాపు అన్ని ప్రాంతాలు వణికిపోయాయి. అత్యధికంగా మల్కాజిగిరి వినాయక్‌నగర్ వార్డు ఆఫీసు ప్రాంతంలో 13 సెం.మీ. వర్షపాతం నమోదైంది. బన్సీలాల్‌పేట్‌లో 8.75, హిమాయత్‌నగర్ విఠల్‌వాడీలో 7.9 సెం.మీ. వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వరణుడు విరుచుకుపడటంతో నగరం అల్లాడిపోయింది. ముఖ్యంగా పాతబస్తీలో వీధిలైట్ల తీగ తెగి పడడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. చార్మినార్ సమీపంలో చెత్తబజార్‌లో పాతకాలం నాటి ఓ కమాన్ స్వల్పంగా కూలింది. అంబర్‌పేట్, ముషీరాబాద్, తదితర ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, నల్గొండ, సూర్యాపేట, నిర్మల్ తదితర జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిశాయి.

**రహదారులపై నరకం..**

వాన సరిగ్గా సాయంత్రం మొదలైంది. ఆఫీసులు ముగిసే సమయానికి కుండపోతగా కురిసింది. కార్యాలయాల నుంచి ఇళ్లకు బయల్దేరిన ఉద్యోగులతో రోడ్లు కిక్కిరిసిపోయాయి. ప్రధాన రహదారులపై వరద ప్రవహిస్తుండటంతో.. వాహనదారులు ఎక్కడికక్కడ నిలిచిపోయారు. మూడు కార్పొరేషన్లు, పోలీస్ కమిషనరేట్ల అధికారులు, హైడ్రా సిబ్బంది రహదారులపై వరదనీటిని దారి మళ్లించేందుకు ప్రయత్నించినప్పటికీ.. ఫలితం కనిపించలేదు. గచ్చిబౌలికొండాపూర్ మార్గం, జూబ్లీహిల్స్ రోడ్డు నం.45మైండ్‌స్పేస్ రహదారుల్లో తీవ్ర ప్రభావం కనిపించింది. ఐటీ కారిడార్‌లోని అన్ని రహదారులపైనా ఇదే పరిస్థితి. ర్యాపిడో, ఇతరత్రా ఆన్‌లైన్ వాహన బుకింగ్‌లు పని చేయక జనాలు ఇబ్బంది పడ్డారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి సైబర్‌టవర్స్ వరకు రాకపోకలు నిలిచిపోయాయి. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు 6 ఫేజ్ ప్రధాన రహదారిపై నడుములోతు నీరు నిలవడంతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. మణికొండలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నెక్నాంపూర్ డివిజన్‌లోని కొన్ని ఇళ్లలోకి నీరు చేరింది. హుస్సేన్‌సాగర్ ట్యాంక్‌బండ్, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు స్టీలు బ్రిడ్జిపైనా వరద ప్రవాహంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎప్పటిలాగే మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద వరద నీరు భారీ స్థాయిలో నిలిచింది. మురుగునీటి పైపులైన్లు, వరద నాలాలు పొంగిపొర్లడంతో మలక్‌పేట్ మెట్రో‌స్టేషన్ కిందనున్న రోడ్డు చెరువులా మారింది. చురుగ్గా రుతుపవనాలు..: నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. కర్ణాటక పరిసరాల్లో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు పేర్కొంది. బుధవారం వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ జిల్లాలకు ‘పసుపు’ రంగు హెచ్చరికలు జారీ చేసింది. రానున్న నాలుగు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.

# ప్రజా ప్రభుత్వానికి రైతుల శ్రమ తెలుసు

చిల్పూర్: ‘కేంద్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొన్నా, కొనకపోయినా రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం రైతుల శ్రమను గుర్తించి చివరి గింజ వరకూ కొంటుంది. రూ.వేల కోట్లు ఖర్చు చేసి రబీ సీజన్‌లో రికార్డుస్థాయిలో 72.30 లక్షల టన్నుల ధాన్యాన్ని మా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంటే.. భారాస, భాజపా నాయకులు కల్లాలోకి వస్తామని, రైతుల కన్నీళ్లు తుడుస్తామని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది’ అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎద్దేవాచేశారు. మంగళవారం జనగామ జిల్లా చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో రూ.60.62 కోట్లతో చేపట్టిన నాలుగు విద్యుత్తు ఉపకేంద్రాల ప్రారంభోత్సవం, మరో మూడు విద్యుత్తు ఉపకేంద్రాలకు శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అక్కడే ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో భట్టి మాట్లాడారు. ‘కేంద్రంలోని భాజపా, రాష్ట్రంలోని ప్రతిపక్ష భారాసలు కుమ్మక్కై మా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయి. గత భారాస ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్ర సంపదను, వనరులను విచ్చలవిడిగా దోపిడీ చేసి, తెలంగాణను రూ.లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసింది. వారు చేసిన అప్పులకు ప్రస్తుతం ఏటా రూ.వేల కోట్ల అసలు, వడ్డీలు బ్యాంకులకు చెల్లించలేక అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రజల సంక్షేమానికి మేము రోజుకు 18 గంటలు పనిచేస్తూ శ్రమిస్తుంటే భారాస నేత హరీశ్‌రావు కేవలం వార్తల్లో కనిపించడం కోసం రోజుకో అబద్ధపు వార్తను సృష్టించి.. నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న రైతులను కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీద వదిలేయాలని చూస్తోంది. మద్దతు ధర ప్రకటించిన తరువాత రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా ఎందుకు సేకరించడం లేదో చెప్పాలని’ అని భట్టి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డి, ఎన్పీడీసీఎల్, ట్రాన్స్‌కో సీఎండీలు వరుణ్‌రెడ్డి, కృష్ణభాస్కర్, జనగామ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.

# అతివల చేతిలోనే ప్రగతి



హైదరాబాద్: ‘‘తెలంగాణ ఆర్థిక ప్రగతి ఆడబిడ్డల చేతిలో ఉంది. వారికి అండగా ఉండే బాధ్యత మాది. ఎవరెన్ని కుట్రలు చేసినా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే వరకు విశ్రమించబోను’’ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని పరిపాలన చేస్తున్నామని, తమ ప్రభుత్వంలో దళారులు, దోపిడీదారులకు చోటులేదన్నారు. వచ్చే లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో 33 శాతం మంది మహిళలకు ప్రాతినిధ్యం దక్కుతుందన్నారు. ఆడబిడ్డలను నిర్లక్ష్యం చేసేవారు అధికారంలో ఉండలేరని, మహిళాలోకం పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద చేపట్టిన మహిళా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగిన మహిళాశక్తి మహాసభలో సీఎం ప్రసంగించారు. ‘‘ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మీదేవితో పోల్చే సంస్కృతి మనది. భూమిని భూమాతగా, దేశాన్ని భారతమాతగా, రాష్ట్రాన్ని తెలంగాణ తల్లిగా భావిస్తాం. చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో మహిళామణులు మన కీర్తిని ప్రపంచానికి చాటారు. మంత్రులుగా, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లుగా, మేయర్లుగా ఆడబిడ్డలు రాణించారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని 2013లో సోనియాగాంధీ పార్లమెంట్‌లో బిల్లు పెట్టారు. రాబోయే రోజుల్లో 33 శాతం మహిళలు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగం కాబోతున్నారు. గత ప్రభుత్వం మొదటి ఐదేళ్లు ఒక్క మహిళకూ మంత్రిగా అవకాశం కల్పించలేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఏనాడూ పార్టీ అధ్యక్ష పదవి మహిళకు ఇవ్వలేదు.

**గత ప్రభుత్వం వడ్డీ లేని రుణాలివ్వలేదు**

ప్రజాప్రభుత్వం వచ్చిన 48 గంటల్లోనే శాసనసభ సాక్షిగా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. కొందరు కడుపునిండా విషం నింపుకొని, కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు. ఉచిత బస్సు సౌకర్యాన్ని రద్దు చేయాలని రోడ్డెక్కారు. అయినా వెనక్కి తగ్గకుండా ఆ పథకాన్ని కొనసాగిస్తున్నాం. ఇందుకోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశాం. ఉచితబస్సుల్లో వెళ్లి మన ఆడబిడ్డలు ఉన్నత చదువులు చదువుకుంటున్నారు. చదువు మానేసే వారి సంఖ్య తగ్గిపోయింది. గత ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన రూ. 4 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలను ఎగ్గొట్టింది. మేం అధికారంలోకి రాగానే వాటిని మంజూరు చేశాం. పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల యూనిఫాంలు కుట్టే పని మహిళా సంఘాలకు అప్పగించాం. ఐకేపీ సెంటర్ల ద్వారా మహిళా సమాఖ్యలకు రూ.159 కోట్ల ఆదాయం వచ్చింది. అంబానీల మాదిరిగా మహిళలు పెట్రోల్‌బంకులు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నాం. అదానీతో పోటీపడేలా సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నాం. కార్పొరేట్ కార్యాలయాలకు దీటుగా ఇందిరా మహిళాశక్తి భవనాలను నిర్మిస్తున్నాం. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయానికి హైటెక్ సిటీలో రూ.వెయ్యి కోట్ల స్థలంలో 106 స్టాళ్లు ఏర్పాటు చేశాం. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల ద్వారా మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాం.

# ఏసీబీ కి చిక్కిన మరో భారీ తిమింగలం

హైదరాబాద్ : రాష్ట్రంలో మరో భారీ అవినీతి తిమింగలం ఏసీబీ వలకు చిక్కింది. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖలో ఛీఫ్ ఇంజనీరుగా పని చేస్తున్న మోహన్ నాయక్ అవినీతి అక్రమాలకు పాల్పడి దాదాపు వంద కోట్ల రూపాయలకు పైగా ఆస్తులను సంపాదించినట్టు ఏసీబీ మంగళవారం జరిపిన అకస్మిత దాడులో వెల్లడైంది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా తెలిపిన వివరాల ప్రకారం ఆర్ అండ్ బి లో ఛీఫ్ ఇంజనీర్ గా పనిచేస్తున్న మోహన్ నాయక్ అవినీతి అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయల ఆస్తులను సంపాదించినట్టు ఏసీబీకి విశ్వసనీయ సమాచారం అందింది. దీనితో తమ విభాగానికి చెందిన ప్రత్యేక టీమ్ లను చారు సిన్హా రంగంలోకి దించారు. వీరు మోహన్ నాయక్ కు చెందిన ఇల్లు, ఇతర ఆస్తులతో పాటు అతని సమీపబంధువులు, స్నేహితులు,బినామీల ఆస్తులపై మెరుపు దాడులను నిర్వహించారు. హైదరాబాద్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లోని మోహన్ నాయక్ కు చెందిన 15 ఆస్తులపై ఈ దాడులను కొనసాగించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఈ దాడులు కొనసాగాయి. ఇందులో మోహన్ నాయక్ కు చెందిన స్థిర, చర, ఆస్తుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లిలో రూ. 82,89,750/ లక్షల విలువైన 19.38 ఎకరాల వ్యవసాయ భూమి, రూ. 7,34,73,867/ కోట్ల విలువైన కొంపల్లిలోని 3 ఫ్లాట్లు,గచ్చిబౌలిలోని 4 ఫ్లాట్లను ఏసీబీ అధికారులు కనుగొన్నారు. అలాగే మియాపూర్ లో రూ.2,50,00,000/ విలువైన 3x విల్లా, కూకట్ పల్లిలో కొత్తగా నిర్మించిన రూ.62,14,000/ విలువైన కొత్త ఇల్లు తో పాటు నిజామాబాద్ లో కొత్త ఇంటి నిర్మాణం కోసం నాయక్ చెల్లించిన కోటి రూపాయల నగదు రసీదు కూడా ఏసీబీ కి చిక్కాయి. దీంతోపాటు అతని నివాసం లో 55 లక్షల రూపాయల విలువైన నగదు, రూ.1.44 కోట్ల బ్యాంకు బాలన్స్ , రూ.2 కోట్ల విలువైన 2500 గ్రాముల బంగారు నగలు, రూ.3.60 లక్షల విలువైన 6000 గ్రాముల వెండి నగలు కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ. 1,26,00,000/ కోట్ల విలువైన గృహోపకరణ వస్తువులు, 11 లక్షల రూపాయల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, రూ. 25 లక్షల విలువైన 2 వాహనాలు కూడా నాయక్ కు చెందినవిగా తేలాయి. వీటి విలువ రూ.17,94,62,617/ కోట్ల రూపాయలుగా అధికారులు గుర్తించారు. వీటి విలువ బహిరంగ మార్కెట్లో వంద కోట్ల రూపాయలకు పైనే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఇంకా మోహన్ నాయక్ అక్రమాస్తుల గురించి దర్యాప్తు సాగుతున్నదని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును నమోదు చేశామని, నిందితుని అరెస్ట్ చేసి ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరు పరిచామని అధికారులు తెలిపారు.

# ట్రంప్ టవర్స్‌తో కొత్త శకం

హైదరాబాద్: రియల్ ఎస్టేట్ రంగంలో ఓ సరికొత్త, ప్రతిష్ఠాత్మక అధ్యాయం మొదలైంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ‘ట్రంప్ టవర్స్’ బ్రాండ్ ఇప్పుడు అధికారికంగా భాగ్యనగరంలోకి అడుగుపెట్టింది. రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం పరిధిలోని కోకాపేటలో నిర్మించనున్న ఈ అల్ట్రా లగ్జరీ నివాస ప్రాజెక్టుకు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (TGRERA) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దీంతో నగరంలో అత్యంత ఖరీదైన, విలాసవంతమైన నివాస సముదాయాల నిర్మాణానికి మార్గం సుగమమైంది. టీజీ రెరా వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ప్రాజెక్టును ‘ఇరా ది ఎడ్జ్ డెవలపర్స్ ఎల్‌ఎల్‌పీ’ సంస్థ అభివృద్ధి చేయనుంది. దీనికి P02400010871 నంబర్‌తో రిజిస్ట్రేషన్ లభించింది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్) వెంబడి ఉన్న కోకాపేట “గోల్డెన్ మైల్” ప్రాంతంలో 16,389.76 చదరపు మీటర్ల (సుమారు 4 ఎకరాలు) విస్తీర్ణంలో ఈ నిర్మాణం చేపట్టనున్నారు. మొత్తం 2,64,580 చదరపు మీటర్ల బిల్ట్‌అప్ ఏరియాకు అనుమతులు లభించాయి. ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి 2031 మే 15ని గడువుగా నిర్దేశించారు. ఈ ప్రాజెక్టును ట్రంప్ ఆర్గనైజేషన్ యొక్క భారత అధికారిక భాగస్వామి అయిన ‘ట్రైబెకా డెవలపర్స్’ మరియు ‘ఇరా రియల్టీ’ సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఆకాశాన్ని తాకేలా రెండు భారీ టవర్లను (జంట టవర్లు) నిర్మించనున్నారు. కొన్ని నివేదికల ప్రకారం, ఈ టవర్లు 63 అంతస్తులకు పైగా ఉండవచ్చని అంచనా. ప్రధానంగా అత్యంత సంపన్నులను లక్ష్యంగా చేసుకుని 3, 4, 5 బీహెచ్‌కే కాన్ఫిగరేషన్‌లతో కూడిన ప్రీమియం అపార్ట్‌మెంట్లను ఇందులో అందుబాటులోకి తేనున్నారు. సుమారు రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్టు తెలుస్తోంది. ట్రంప్ బ్రాండ్ అనగానే గుర్తొచ్చే ప్రత్యేకమైన డిజైన్, ప్రపంచ స్థాయి సదుపాయాలు ఈ ప్రాజెక్టులో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రైవేట్ ఎలివేటర్లు, రెండు టవర్లను కలిపే స్కై బ్రిడ్జ్‌లు, అత్యున్నత ప్రమాణాలతో కూడిన క్లబ్‌హౌస్ వంటి ఎన్నో ప్రత్యేకతలు ఇందులో ఉండనున్నాయి. హైదరాబాద్‌లో లగ్జరీ నివాసాలకు పెరుగుతున్న డిమాండ్‌కు ఈ ప్రాజెక్ట్ అద్దం పడుతోంది. ఇప్పటికే దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో ట్రంప్ టవర్స్ విజయవంతం కాగా, ఇప్పుడు హైదరాబాద్ వంతు వచ్చింది. ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం కోసం త్వరలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనయులు డొనాల్డ్ ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్ భారత్‌లో పర్యటించే అవకాశాలు ఉన్నాయని కూడా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, హైదరాబాద్ స్కైలైన్‌లో ఇది ఒక ఐకానిక్ ల్యాండ్‌మార్క్‌గా నిలిచిపోవడం ఖాయం.

# కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ... మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ

మధ్యప్రదేశ్ రాజ్యసభ ద్వివార్షిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ తరఫున ఏకైక అభ్యర్థిగా బరిలో ఉన్న మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి మంగళవారం తిరస్కరించారు. తెలంగాణ కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఒక కేసుకు సంబంధించిన సమాచారాన్ని ఆమె ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారంటూ బీజేపీ లేవనెత్తిన అభ్యంతరంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్ కోర్టులో మీనాక్షి నటరాజన్‌పై ఒక పిటిషన్ దాఖలైంది. లైంగిక వేధింపులు, ప్రాణహాని బెదిరింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి మీనాక్షి రాజకీయ అండదండలు అందించారని ఎ.శ్రీలత అనే మాజీ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఈ విషయాన్ని నామినేషన్‌లో ప్రస్తావించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే, బీజేపీ ఆరోపణలను కాంగ్రెస్ నేత ఉమంగ్ సింఘార్ “బలవంతపు రాజకీయాలు”గా అభివర్ణించారు. మీనాక్షిపై ఎలాంటి కేసు నమోదు కాలేదని, కేవలం కోర్టు నుంచి నోటీసు మాత్రమే అందిందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కేసు నమోదైతేనే వివరాలు వెల్లడించాలి తప్ప, నోటీసుకు కాదని వాదించారు. ఇదంతా తన ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు చేస్తున్న రాజకీయ కుట్ర అని మీనాక్షి నటరాజన్ అన్నారు. “ఒక గాంధేయవాద మహిళను చూసి బీజేపీ భయపడుతోంది” అని ఉమంగ్ సింఘార్ ఎక్స్ వేదికగా విమర్శించారు. “వారి నినాదం ‘నారీ వందన్’, కానీ నైజం ‘నారీ అపమాన్’.. ఇదే బీజేపీ అసలు స్వరూపం” అని దుయ్యబట్టారు. సత్యం, రాజ్యాంగం, ప్రజాభిప్రాయం శక్తితో తాము విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మీనాక్షి నటరాజన్ ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగా కొనసాగుతుండడం తెలిసిందే.

# ఢిల్లీ అగ్నిప్రమాదం.. కుటుంబంలోని 8 మంది మృతి

ఢిల్లీ: ఇటీవల జరిగిన ఘోర అగ్నిప్రమాద విషాదంలో మరో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తన కుటుంబ సభ్యులు ఎనిమిది మందిని కోల్పోయిన 80 ఏళ్ల రాధే శ్యామ్ అగర్వాల్, ఆ చేదు నిజం తెలియకుండానే మంగళవారం కన్నుమూశారు. దీంతో గురుగ్రామ్‌కు చెందిన అగర్వాల్ కుటుంబం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న రాధే శ్యామ్ అగర్వాల్ ఢిల్లీలోని సాకేత్ మాక్స్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆయన్ను చూసుకునేందుకు గురుగ్రామ్‌లో నివసించే ఆయన కుమారుడు వివేక్ అగర్వాల్, కోడలు, మనవరాళ్లతో సహా మొత్తం ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఢిల్లీకి వచ్చారు. వీరంతా ఆసుపత్రికి సమీపంలోని మాల్వియా నగర్‌లో ఉన్న ‘ఫ్లరిష్ స్టే’ అనే హోటల్‌లో బస చేశారు. జూన్ 3న ఉదయం 8:30 గంటల సమయంలో ఆ హోటల్‌లోని వంటగదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వివేక్ అగర్వాల్ కుటుంబ సభ్యులు ఎనిమిది మందితో పాటు మొత్తం 21 మంది ప్రాణాలు కోల్పోయారు. తన కుటుంబానికి ఇంతటి ఘోరం జరిగిందన్న విషయం తెలియని రాధే శ్యామ్, తన వాళ్లెవరూ పలకరించడానికి రావడం లేదని ఆసుపత్రి సిబ్బందిని నిరంతరం ఆరా తీస్తుండేవారు. చివరకు ఆయన కూడా చికిత్స పొందుతూ మృతి చెందడంతో, ఆ కుటుంబంలో ఒక్కరు కూడా మిగలకుండా పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు, హోటల్ యజమాని లవకేశ్ బజాజ్, వంట మనిషి కేశవ్ నేగిని అరెస్ట్ చేశారు. భవన నిర్మాణం, అగ్నిమాపక భద్రతా నిబంధనల్లో తీవ్ర లోపాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ దుర్ఘటనతో గురుగ్రామ్‌లోని అగర్వాల్ కుటుంబ నివాసం మూగబోయింది.

# సీఐడీ ఎంట్రీతో కలకలం.. దీదీ సర్కార్‌కు మరో షాక్!

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, ఎమ్మెల్యేలు, ఎంపీల తిరుగుబాటుతో ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో ఉన్న మమతా బెనర్జీకి మరో తలనొప్పి వచ్చిపడింది. శాసనసభ్యుల సంతకాల ఫోర్జరీ ఆరోపణల కేసు దర్యాప్తులో భాగంగా ఆ రాష్ట్ర సీఐడీ అధికారులు మంగళవారం మమతా బెనర్జీ నివాసానికి చేరుకున్నారు. కోల్‌కతాలోని 30B, హరీశ్ ఛటర్జీ స్ట్రీట్‌లో ఉన్న ఆమె నివాసంలో సోదాలు నిర్వహించేందుకు సీఐడీ బృందం అక్కడకు వెళ్లడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆమె ఇంటి చిరునామాతో తృణమూల్ కాంగ్రెస్ అధికారిక పార్టీ కార్యాలయం కూడా నమోదై ఉన్నందున తాము ప్రాంగణాన్ని తనిఖీ చేయాల్సి ఉందని సీఐడీ అధికారులు పేర్కొన్నారు. అయితే, మాజీ ఎంపీ సుభాశిష్ చక్రవర్తితో సహా పలువురు టీఎంసీ నాయకులు అధికారులను లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో నివాసం వెలుపల కొంత సేపు తీవ్ర ఉద్రిక్తత, వాగ్వాదం చోటుచేసుకున్నాయి. మమతా బెనర్జీ, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఇద్దరూ ప్రస్తుతం ఇంట్లో లేరని, కాబట్టి సోదాలకు అనుమతించలేమని, ఒకట్రెండు రోజుల తర్వాత రావాలని సుభాశిష్ చక్రవర్తి కోరారు. అయితే, దీనిపై సీఐడీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. తాము చట్టప్రకారం విచారణకు వస్తే అడ్డుకోవడం నేరమని స్పష్టం చేశారు. కొద్దిసేపు ఘర్షణ తర్వాత సీఐడీ బృందం లోపలికి వెళ్లింది.

**అసలు వివాదం ఏంటి?**

మే 20న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ స్పీకర్‌కు తృణమూల్ కాంగ్రెస్ తరఫున ఒక లేఖ సమర్పించారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా సోవన్ దేబ్ ఛటోపాధ్యాయను ఎన్నుకుంటూ ఈ లేఖను ఇచ్చారు. అయితే ఈ లేఖపై ఉన్న తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ టీఎంసీ ఎమ్మెల్యేలు రితబ్రతా బెనర్జీ, సందీపన్ సాహా సంచలన ఆరోపణలు చేశారు. ఈ వివాదం ముదిరి ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఈ ఫోర్జరీ వ్యవహారంపై కోల్‌కతాలోని హేర్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కాగా బెంగాల్ ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. స్పీకర్‌కు పంపిన ఆ వివాదాస్పద లేఖపై పార్టీ జనరల్ సెక్రటరీ అభిషేక్ బెనర్జీ సంతకం చేసినందున, విచారణకు హాజరుకావాలంటూ సీఐడీ ఆయనకు పలుమార్లు సమన్లు జారీ చేసింది. అయితే, అనారోగ్య కారణాలను చూపుతూ అభిషేక్ బెనర్జీ వ్యక్తిగతంగా హాజరుకాకుండా.. తనకు 15 రోజుల సమయం కావాలని కోరారు.

## ఆర్య వైశ్య మహసభ రాష్ట్ర అదనపు ఈసీ మెంబెర్ గా బుక్కా ఈశ్వరయ్య



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఈసీ మెంబర్గా, నల్గొండ పట్టణానికి చెందిన బుక్కా ఈశ్వరయ్యను నియమిస్తూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ నియామక ఉత్తర్వులు అందజేశారు. నిత్యం సమాజ సేవలో, సంఘసేవ లో అనేక కార్యక్రమాలు చేస్తూ, రెడ్ క్రాస్ సంస్థలో గోల్డ్ మెడల్ పొందిన బుక్కా ఈశ్వరయ్య సేవలను గుర్తిస్తూ మహాసభ అదనపు ఈ సి మెంబర్గా ఆయనను నియమించారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో గత 30 సంవత్సరాలుగా వివిధ హోదాలలో పనిచేసి సంఘపటిష్టతకు కృషి చేస్తున్నారు.బెస్ట్ సేవా సొసైటీని స్థాపించి పేదలకు ఆర్థిక సాయం వృద్ధులకు వికలాంగులకు అనాథ ఆశ్రమాలకు విద్యార్థులకు ఆర్థిక సహకారం అందిస్తున్న.బుక్కా ఈశ్వరయ్య సేవలను గుర్తించారు. అలాగే కరోనా సమయంలో కొంతమంది బ్రాహ్మణులకు నిత్యవసర సరుకులు అందజేసి దాతృత్వం చాటుకున్నారు. గతంలో మూడు పర్యాయాలు పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయ ధర్మకర్తగా పనిచేసారు.ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం హెచ్ డి పి మెంబర్గా ప్రస్తుతం కొనసాగుతున్నారు. బుక్కా ఈశ్వరయ్యను రాష్ట్ర అదనపు ఈ సిమ్ నెంబర్ గా నియమించడం పట్ల పలువురు రాష్ట్ర జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.


## మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా

* **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : సుభాష్ నగర్ డివిజన్ తో పాటు అన్ని ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని రాజుల స్వామి నగర్, సిద్దార్థ్ నగర్, జై శ్రీరామ్ నగర్, మరాఠీ బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలపై బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మంగళవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా రాజుల స్వామి నగర్ లో భూగర్భ డ్రైనేజీ అవుట్ లెట్ సమస్య, సిద్ధార్థ నగర్ లో భూగర్భ డ్రైనేజీ సమస్యతో పాటు శానిటేషన్ సమస్య, వరద నీటి సమస్య, జై శ్రీరామ్ నగర్ లో సీసీ రోడ్డు సమస్యతో పాటు నాలా సమస్యను పరిశీలించిన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పారిశుధ్య నిర్వహణ, భూగర్భ డ్రైనేజీ పనులలో అధికారుల నిర్లక్ష్య వైఖరి పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ ను ఎంతో అభివృద్ధి పరిచామని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని రానున్న రోజుల్లో కూడా కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య, ఈఈ సుబ్రహ్మణ్యం, డీజీఎం శ్రావణి, వివిధ విభాగాల అధికారులు అలాగే స్థానిక నాయకులు మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, పోలే శ్రీకాంత్, వారాల వినోద్, రాజ్ కుమార్ ముదిరాజ్, కోల శ్రీకాంత్ ముదిరాజ్, గుబ్బల లక్ష్మీ నారాయణ, రవి, వేణు, మరాఠి అశోక్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, స్వామి, చందు,గట్టు అశోక్, కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనపూర్ పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో పోలీసు సేవలను మరింత మెరుగుపర్చే లక్ష్యంతో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ మంగళవారం ఘనపూర్ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

# జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

* **జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాలేశ్వరం, ప్రజాస్ఫూర్తి : జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సాధన, సంఘం బలోపేతమే ధ్యేయంగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజేఐజేయూ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కాలేశ్వరంలో జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, హెల్త్ కార్డు సభ్యుడు సామల శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంకణాల సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇటీవల మృతి చెందిన జర్నలిస్టులను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు. జర్నలిస్టుల సంక్షేమం, హెల్త్ కార్డుల జారీ, ఇళ్ల స్థలాల కేటాయింపు, జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్ అమలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే మార్గమని, రాష్ట్రవ్యాప్తంగా పాత్రికేయుల సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు ప్రతి జర్నలిస్టుకు అందేలా సంఘం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల సాధనలో టీయూడబ్ల్యూజే చేసిన సేవలను గుర్తు చేస్తూ ప్రతి పాత్రికేయుడు సంఘంతో అనుబంధం పెంచుకోవాలని పిలుపునిచ్చారు. సంఘ బలోపేతానికి సభ్యత్వ నమోదు కీలకమని పేర్కొంటూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని జర్నలిస్టులందరూ సభ్యత్వాలు నమోదు చేసుకుని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ నెల 29న భూపాలపల్లిలో నిర్వహించనున్న జిల్లా మాససభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు సట్ల మురళి, ఎంఎల్ఎన్ మూర్తి, శ్రీశైలం, ప్రవీణ్ కుమార్, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, మూబిన్, టేమ్జ్ అధ్యక్షుడు సాంబయ్య, రజనీకాంత్, సుమన్, రాజబాబు,లక్ష్మీనారాయణ,కామిడి బాస్కర్ రెడ్డి,సుదాకర్ తో పాటు జిల్లాలోని వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమ సాధన దిశగా ఈ సమావేశం ఉపయోగకరంగా నిలిచిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కేరాఫ్ అడ్రస్ ప్రభుత్వ పాఠశాలలు

* **విద్య రంగం లో మెదక్ జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి**
* **జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: విద్య రంగం లో మెదక్ జిల్లా ను మొదటి స్థానంలో నిలపాలనీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో గత సం: పదవ తరగతిలో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యారంగంలో జిల్లా ఉన్నత స్థానంలో ఉండాలని సూచించారు. సమాజంలో వ్యక్తి నీ ఉన్నతమైన స్థాయిలో నిలపాలంటే విద్య ద్వారానే సాధ్యం అయితుందన్నారు. విద్యార్థులు ఐ.ఐ.ఐ.టి వైపే కాకుండా దేశంలో ఉన్నత విద్యా సంస్థలైన ఐఐటి లలో స్థానాన్ని పొందడానికి, ఎయిమ్స్ లాంటి ఉత్తమమైన వైద్య కళాశాలలో ప్రవేశాలు పొందడానికి ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు ఉన్నతమైన శిఖరాలు అధిరోహించి భవిష్యత్తులో మంచిస్థాయి లో ఉండాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 91 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, 560 ఆపై మార్కులు పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాన్ని, ఎగ్జిక్యూటివ్ ఫైల్ , డిక్షనరీ , పెన్స్ ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, సుదర్శన మూర్తి, కరుణాకర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు, సహాయ గణాంక అధికారి నవీన్, ఎంఈఓ లు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎమ్మార్పీలు , విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంల భద్రతపై కలెక్టర్ తనిఖీ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును తనిఖీ చేశారు. గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీప్యాట్ల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సీసీటీవీ పర్యవేక్షణ, అగ్నిమాపక పరికరాలు, డబుల్ లాక్ విధానం తదితర భద్రతా చర్యలను పరిశీలించిన కలెక్టర్, యంత్రాల నిర్వహణ రికార్డులు, స్ట్రాంగ్ రూమ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతకు ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రత కీలకమని పేర్కొన్న ఆయన, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి గోదామును తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. యంత్రాల భద్రతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ రిజిస్టర్లో సంతకం చేసి గోదాముకు తాళం వేసి సీల్ వేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నవీన్తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో పోలీసులే ఆదర్శంగా నిలవాలి

* **మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు**




మెదక్ జిల్లా , ప్రజాస్ఫూర్తి : మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్లో వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆస్టేషన్లోని పరిపాలన, నేరాల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఎఫ్ఐఆర్ల నమోదు విధానం, స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్ నమోదు విధానం తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ సిబ్బందికి కేటాయించిన సామగ్రి, సర్వీస్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని ఆదేశించారు. నిష్పక్షపాత విధుల ద్వారానే ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సిబ్బందికి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లలో ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, వారి కదలికలు, ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారి ప్రస్తుత స్థితిగతులను తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. నేరాల నియంత్రణలో బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొంటూ, వ్యక్తిగత ఇబ్బందులు ఉన్న వారు ప్రతి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో తనను నేరుగా కలవవచ్చని తెలిపారు. దీంతో సిబ్బంది సమస్యలను స్వేచ్ఛగా తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు జార్జ్, సందీప్ రెడ్డి, ఎస్ఐ లింగం తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాలి

* **గండ్ర వెంకట రమణారెడ్డి**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : సింగరేణి కార్మికుల హక్కులు, సంస్థ భవిష్యత్తును కాపాడుకునేందుకు కార్మిక లోకం ఐక్యంగా పోరాడాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు. భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని కేటీకే 1 ఇంక్లైన్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థపై అన్యాయ విధానాలు అమలు చేస్తోందని ఆరోపించిన ఆయన, సంస్థను ఆర్థికంగా బలహీనపరిచే చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల అంశంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని గండ్ర ఆరోపించారు. కార్మికుల సమస్యలపై గుర్తింపు సంఘాలు స్పందించని పరిస్థితుల్లో తాము బాధ్యతగా ముందుకు వచ్చి పోరాడుతున్నామన్నారు. కార్మికుల సంక్షేమానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేసిందని, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు వంటి పథకాలు అందులో భాగమని గుర్తుచేశారు.ఈ నెల 12న భూపాలపల్లిలో జరిగే సమావేశానికి మాజీ మంత్రి టి. హరీష్రావు హాజరవుతున్న నేపథ్యంలో సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గండ్ర పిలుపునిచ్చారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

## సర్దర్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ప్రతిష్ఠించాలి

* **జై గౌడ్ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి బీసు వెంకటేశం గౌడ్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ప్రపంచ తొలి తెలుగు దళిత బహుజన విప్లవ వీరుడు సర్దర్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ట్యాంక్ బండ్ పై ప్రతిష్ఠించాలని జై గౌడ్ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి బీసు వెంకటేశం గౌడ్ డిమాండ్ చేశారు. జై గౌడ్ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుండ్రంతి నారాయణ గౌడ్ పిలుపుమేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్. విగ్రహాన్ని త్వరలోని హైదరాబాద్ ల్లో ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 100 అడుగుల విగ్రహాన్ని పెడతామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టి మాట తప్పారన్నారు. గత సంవత్సరం ఆగస్టు 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహా ఏర్పాటుకు సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు బొమ్మమహేష్ కుమార్ గౌడ్ , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లు శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటికి పనులు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

## గిరిజన హక్కుల పోరాట యోధుడు బిర్సాముండా 126 వర్ధంతి




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణంలో బిర్సాముండా వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ ఎస్టి సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోత్ వెంకట్ నాయక్,బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ముంజాల రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వెంకట్ నాయక్, ముంజల రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ గిరిజనోధ్యమా నాయకుడు బిర్స ముండా భారతదేశంలోని ప్రముఖ స్వతంత్ర పోరాట నాయకులు. ఆయన జార్ఖండ్ ప్రాంతంలోని ముండా తెగకు చెందినవారు.బ్రిటిష్ పాలనకు అలాగే స్థానిక జమీందారుల దోపిడీకి వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి ఉద్యమం నడిపిన నాయకుడు.ఈ ఉద్యమాన్ని ఉల్గులాన్ అనగా మహా తిరుగుబాటు చేశాడు.ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ టౌన్ అధ్యక్షుడు తేజావత్ శంకర్ నాయక్, ఎస్టీ సెల్ బోడ రాము టౌన్ వైస్ ప్రెసిడెంట్, అల్లి దుర్గేష్ టన్ ఓబీసీ అధ్యక్షులు, టౌన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే గఫూర్, బోడ శ్రావ్య నాయక్ ఆదివాసి నాయకులు, కొత్త యుగేందర్ ,బానోత్ బద్రమ్మ భూక్య రాధా, బోడ అలీ, పల్లి రాములు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సంఘ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం.. రెండు నిండు ప్రాణాలు బలి

గాలిదుమారంతో కురిసిన భారీ వర్షం నిండుప్రాణాలను బలిగొంది. తెగిపడిన విద్యుత్ తీగ కారణంగా షాక్కు గురై.. ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన హైదరాబాద్ పాతబస్తీలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ ఆర్.దేవేందర్, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. బండ్లగూడ పోలీసుస్టేషన్ పరిధిలోని జహంగీరాబాద్కు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ అఫ్రోజ్ (30), తొమ్మిదో తరగతి విద్యార్థి మహ్మద్ జాఫర్ (15) ఒకే వీధిలో నివసిస్తున్నారు. మంగళవారం సాయంత్రం.. హోటల్ నుంచి చాయ్ తీసుకురావాలని తల్లి ఖాజాబీ కోరడంతో మహ్మద్ అఫ్రోజ్ తన ఆటోలో జాఫర్ను ఎక్కించుకుని రాయల్ సీ హోటల్కు వెళ్లాడు. అప్పటికే అక్కడి హైమాస్ట్ వీధిదీప స్తంభంపై ఉన్న తీగ భారీ వర్షానికి తెగి కింద పడింది. సమీపంలోని మ్యాన్హోల్ నుంచి నీరు ప్రవహిస్తుండడంతో ఆ ప్రాంతం వరదమయంగా మారింది. తీగ తెగిపడిన సమాచారాన్ని హోటల్ యజమాని జహంగీర్ స్థానిక మజ్లిస్ నాయకుడి ద్వారా విద్యుత్ అధికారులకు తెలిపారు. సంఘటన స్థలంలోకి ఎవరూ వెళ్లవద్దంటూ అందరినీ హెచ్చరిస్తుండగానే.. అఫ్రోజ్, జాఫర్లు వచ్చిన ఆటో అక్కడ ఆగింది. రావొద్దంటూ అందరూ కేకలు పెట్టినా.. వర్షపుహోరులో వారికి అర్థం కాలేదు. అందరూ చూస్తుండగానే ఆటోలోంచి కిందకు దిగిన జాఫర్ విద్యుత్ షాక్కు గురయ్యాడు. వెంటనే అతడిని రక్షించబోయిన అఫ్రోజ్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అఫ్రోజ్ అక్కడే మృతిచెందగా.. జాఫర్ను ఆసుపత్రికి తరలిస్తుండగా కన్నుమూశాడు. తీగ ప్రమాదభరితంగా ఉందని రెండు రోజుల కిందటే జీహెచ్ఎంసీ విద్యుత్ విభాగానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ పలువురు ఆరోపించారు.

# పురుగుమందుల నిల్వలపై ఆకస్మిక తనిఖీలు



జనగామ, ప్రజాస్ఫూర్తి : రైతులకు నా ణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్లు అందు బాటులో ఉండేలా చర్యలు చేపడుతూ, నిబంధనల అమలును పరిశీలించేందు కు జనగామ డీసీపీ రాజ మహేంద్ర నా యక్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ, రె వెన్యూ, పోలీసు అధికారులతో కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు.హైదరాబాద్ రోడ్డులో ఉన్న జె.కె.ఎస్ అగ్రి మాల్ లో పురుగుమందుల నిల్వ లు, విక్రయ విధానాలు, లైసెన్సులు, ని బంధనల అమలును అధికారులు పరి శీలించారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసా య అధికారి, వ్యవసాయ అధికారులు, రెవెన్యూ ఆర్.ఐ, జూనియర్ అసిస్టెంట్, జీపీఓ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. రైతులకు అసలైన, నాణ్యమైన వ్యవ సాయ ఉత్పత్తులు అందుబాటులో ఉం డేలా చూడడం, నకిలీ లేదా నాణ్యతలేని పురుగుమందుల విక్రయాలను అరి కట్టడం లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టిన ట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ ఇన్‌పుట్ల విక్రయం లో నిబంధనలు త ప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనల కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

* **నేడు సిపిఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నాకు ఏఐవైఎఫ్ మద్దతు**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: దేశంలో పెరుగుతున్నటువంటి పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి ఎడెల్లి శ్రీకాంత్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ధర్మ బిక్షం భవనంలో సిపిఐ చలో కలెక్టరేట్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే యుద్ధం కారణంగా నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద మధ్యతరగతి ప్రజలపై పెట్రోల్ లీటర్ కి పది రూపాయలు డీజిల్ పై పది రూపాయలు గ్యాస్ పై 70 రూపాయలు పెంచడం అత్యంత దుర్మార్గం అన్నారు. ఈరోజు జరిగే సిపిఐ కలెక్టరేట్ ధర్నాకు పెద్ద ఎత్తున యువజనులు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బూర సైదులు,గౌరవ అధ్యక్షులు కుక్కడప్పు శౌరి, అయితగాని కామేష్, రెడ్డి మల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పర్యటించిన ట్రైనీ ఐఏఎస్ లు



ప్రజాస్ఫూర్తి , జన్నారం : తెలంగాణ దర్శన్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా 2025 బ్యాచ్ ఐఎస్ శిక్షణాధికారులు మంగళవారం కవ్వాల్ టైగర్ రిజర్వ్ లోని జన్నారం అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ.సాయి శివాని,సచిన్ బసవరాజ్, పి. హరి ప్రసాద్, సురేష్ పామూరి , సఫారీ మార్గంలో వన్యప్రాణులను వీక్షించారు. బర్డ్ వాచింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.జన్నారం, తాళ్లపేట అటవీ రేంజ్ ల పరిధిలోని మల్యాల వాచ్ టవర్, బైసన్ కుంట, నీలుగాయి సోలార్ కుంటలను పరిశీలించారు. కవాల్ అభయారణ్యం, టైగర్ రిజర్వ్ లోని వృక్ష, జంతుజాలం గురించి తెలుసుకున్నారు. అటవీ, వన్యప్రాణి సంరక్షణలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలు, ఎకో టూరిజం కార్యక్రమాల గురించి అటవీ అధికారులను అడిగి వివరాలు సేకరించారు. జన్నారం అటవీ డివిజనల్ అధికారి ఎం.రామ్ మోహన్, డిప్యూటీ రేంజ్ అధికారి రాము అధికారులకు పలు అంశాలు వివరించారు.అటవీ సిబ్బంది భోజ నాయక్, శ్రీకాంత్, అజీజ్ లు పాల్గొన్నారు.

# ఘనంగా సీనియర్ పాత్రికేయులు శేఖర్ జన్మదిన వేడుకలు



జిన్నారం (గుమ్మడిదల), ప్రజాస్ఫూర్తి :గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో సీనియర్ పాత్రికేయులు శేఖర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సీజీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో కేక్ కట్ చేసి శేఖర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో జన్మదిన వేడుకలను నిర్వహించి శేఖర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. రైతు సంఘం అధ్యక్షులు అమ్మగారి సదానంద రెడ్డి, జిల్లా రైతు సమాఖ్య ఉపాధ్యక్షులు మద్దుల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘం ఆవరణలో కూడా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు ఆయనకు మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతు సంఘం సభ్యులు, పాత్రికేయులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ మహానగర అభివృద్ధి ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుంది

* **బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : బాచుపల్లి ఫ్లేవర్ నిర్మాణంతో పాటు హైదరాబాద్ మహానగర అభివృద్ధి ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. మంగళవారం సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లి చౌరస్తాలో నూతనంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఫ్లై ఓవర్ ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని, నిర్లక్ష్య ధోరణిని ఆయన ఎండగట్టారు. బిఆర్ఎస్ ప్రభుత్వహయాంలో శంకుస్థాపన చేసిన పనులను ప్రారంభించడం తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒకటి లేదన్నారు. అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, అలసత్వాన్ని అసెంబ్లీ వేదికగా పలుమార్లు ప్రశ్నించినందుకే ఈ బాచుపల్లి ఫ్లైఓవర్ పనులు పూర్తయి అం దు బా టు లో కి వ చ్చిం ద న్నా రు . ప్రభుత్వంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన కొట్లాడి అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు కృషి చేసే ఏకైక పార్టీ బిఆర్ఎస్ అన్నారు. ముఖ్యమంత్రి ఆగ మేఘాల మీద శంకుస్థాపనలు చేసి ఎక్కడో మియాపూర్ లో ఉంటూ బాచుపల్లి ఫ్లైఓవర్ ను ప్రారంభించడం కుత్బుల్లాపూర్ ప్రజలను అవమానించడమేనన్నారు. ఎస్ ఎన్ డి పి, ఎస్ ఆర్ డి పి పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు హెచ్ సిటి అంటూ పేరు మార్చడం తప్పా చేసింది ఏం లేదన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయిన ఇప్పటివరకు సుచిత్ర కొంపల్లి ఫ్లైఓవర్ పనులను పూర్తి చేయలేకపోయిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం నేపాన్ని నెట్టివేసి చేతులు దోచుకుంటున్నారే తప్పా చేసిందేమీ లేదన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం తన ఊహల నగరమైన ఫోర్త్ సిటీని ప్రచారం చేస్తూ ఉన్న నగరాన్ని విస్మరిస్తున్నారని ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్రం తో పాటు హైదరాబాద్ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీయే రక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు, కాసాని సుధాకర్, బాలాజీ నాయక్, చందు ముదిరాజ్, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు సలీం, చంద్రగిరి సతీష్, స్థానిక నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత – ఒకరి అరెస్టు


* **అనుమతులు లేకుండా ఇసుక తరలి స్తే కఠిన చర్యలు : ఎస్సై నరేష్ యాదవ్**



రఘునాథ్ పల్లి / జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లా లోని రఘునాథ్ పల్లి మండలం, ఖిలాషాపూర్ గ్రామ పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను పోలీసులు పట్టుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రఘునాథ్‌పల్లి ఎస్సై నరేష్ యాదవ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం,మంగళవారం ఉదయం కిలాసాపూర్ గ్రామంలో పెట్రోలింగ్ నిర్వ హిస్తున్న సమయంలోవిశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు తని ఖీలు చేపట్టారు.ఈ క్రమంలో గ్రామానికి చెందిన రంగు సంతోష్‌గౌడ్ (సంతోష్ కుమార్) ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ యాదవ్ మాట్లాడుతూ, మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మట్టి లేదా ఇతర ఖనిజాలను అక్రమంగా తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. అక్రమ రవాణా పై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రజ లు కూడా ఇలాంటి కార్యకలాపాల గు రించి సమాచారం అందించాలని ఆయ న కోరారు

# సూర్యాపేటలో సభ్యత్వ నమోదులో దూసుకుపోతున్న టీయూడబ్ల్యూజే-ఐజేయూ

* **జర్నలిస్టులకు అండగా భరోసాగా నిలుస్తున్న టీయూడబ్ల్యూజే ఐజేయు**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిస్తూ, అర్థ శతాబ్దానికి పైగా జర్నలిస్టుల హక్కుల సాధన కోసం కృషిచేస్తున్న సంఘం టీయూడబ్ల్యూజే ఐజేయూ అని, సూర్యాపేట జిల్లాలో సభ్యత్వ నమోదులో టీయూడబ్ల్యూజే ఐజేయు దూసుకుపోతుందని టి యు డబ్ల్యూ జే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు అన్నారు. టీయూడబ్ల్యూజే ఐజేయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వార్త దినపత్రిక జిల్లా బ్యూరో శిగ సురేష్‌గౌడ్ కు సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ జర్నలిజం రంగంలో తనకంటూ ఒక గుర్తింపును పొంది అనేక సంచలన కథనాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచి ప్రజల సమస్యలపై ఎన్నో మంచి కథనాలను అందించిన శిగ సురేష్ గౌడ్ కు యూనియన్ లో తగు ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. పాలకులు ఎవరైనా జర్నలిస్టుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడే సంఘం టీయూడబ్ల్యూజే ఐజేయూ మాత్రమేనని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించే శిక్షణా తరగతులను త్వరలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ కృష్ణ బంటు, సాక్షి విజయ్, బత్తుల మల్లికార్జున్, రషీద్, బిగ్ టివి రామకృష్ణ, ఎబిఎన్ మల్లేష్, హెచ్ ఎం టివి నాగరాజు, లింగాల సాయి, కొండ్లె కృష్ణయ్య,99 టివి జహీర్, తదితరులు పాల్గొన్నారు.

# దేవరుప్పుల మండల అభివృద్ధి పై ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమీక్ష



పాలకుర్తి / జనగామ, ప్రజాస్ఫూర్తి : పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవరుప్పుల మండల ముఖ్య నాయకులతో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలం లోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,పార్టీ బలోపేతం తదితర అంశాల పై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల అమలే ప్రభు త్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య లు, రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, వి ద్యుత్ సరఫరా, రైతుల ఇబ్బందుల పై నాయకుల నుంచి వివరాలు సేకరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా నాయకులు కృషి చే యాలని పిలుపునిచ్చారు. సమా వేశం లో విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సంఘాల అభివృద్ధి, యువత కు ఉపాధి అవకాశాల కల్పన వంటి కీలక అంశాలపై కూడా చర్చ జరిగింది. గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులను తీసుకురావడం లో తాను ఎల్లప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో దేవరుప్పుల మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఐదు రోజుల పాటు భారీ వర్షాల హెచ్చరిక

* **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : భారత వాతావరణ శాఖ హైదరాబాద్ కేంద్రం హెచ్చరికల మేరకు జిల్లాలో రానున్న ఐదు రోజుల పాటు వాతావరణంలో గణనీయ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. వర్షాలతో పాటు గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలబడకుండా పటిష్టమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. రైతులు వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, ఉరుములు సంభవించే సమయంలో పొలాల్లో పనులు నిలిపివేయాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని సూచించారు. బలమైన గాలుల కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలే ప్రమాదం ఉండటంతో విద్యుత్, నీటి సరఫరాకు అంతరాయం కలగవచ్చని తెలిపారు. ప్రజలు 'దామిని', 'మౌసమ్', 'మేఘదూత్' యాప్‌ల ద్వారా వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికారులకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఆదివాసీల ఆరాధ్యదైవం బిర్సముండా వర్ధంతి



మహబూబాబాద్, ప్రజా స్ఫూర్తి: నలంద డిగ్రీ కళాశాలలో బిర్సా ముండా 126 వర్ధంతి సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో బీర్సాముండా చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు పార్నంది రామయ్య మాట్లాడుతూ భారతీయ ఆదివాసి స్వాతంత్ర్య సమరయోధుడు, జనపద నాయకుడు. ఇతడు ముండా గిరిజన జాతికి చెందినవాడు.19వ శతాబ్దపు చివరి రోజుల్లో నేటి బీహార్, జార్ఖండ్ ఆధివాసి ప్రాంతాల్లో బ్రిటిష్ కాలంలో జరిగిన మిలీనేరియన్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. 22 ఏళ్ల వయసులో (1897) బ్రిటిష్‌లపై యుద్ధం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు వర్ణాంది రామయ్య, నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కేబి శంకర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గట్ల శ్రీపాల్ రెడ్డి, అధ్యాపకులు ముత్తయ్య కావ్య మైమోనా తదితరులు పాల్గొన్నారు.


# జన్నారం.. ఇంచార్జ్ ఎఫ్.ఆర్.ఓగా వికాస్



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం అటవీ డివిజన్ జన్నారం ఇన్చార్జి ఎఫ్ఆర్ఓ గా వికాస్ మంగళవారం రోజున బాధ్యతలు స్వీకరించారు. వారం రోజుల క్రితం ఎఫ్ ఆర్ ఓ గా బాధ్యతలు చేపట్టిన బాబా ఖాదర్ వలీ అనారోగ్య కారణంగా దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో తాళ్లపేట ఎఫ్ఆర్ఓ గా విధులు నిర్వహిస్తున్న వికాస్ ను జన్నారం ఇన్చార్జి ఎఫ్ఆర్వో గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన సంరక్షణ మన అందరి బాధ్యత అని, ఎవరైనా అక్రమ కలప రవాణా చేసిన,అక్రమ ఇసుక రవాణా చేసిన, వన్యప్రాణులను వేటాడిన అట్టివారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మాతా శిశు మరణాలు తగ్గించాలి

**: డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:గర్భిణీలకు నాణ్యమైన ప్రసూతి పూర్వ సేవలు అందించడం ద్వారా మాతా, శిశు మరణాలను తగ్గించడమే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ తెలిపారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా గుడిపాడు యూపీహెచ్‌సీని డీఎంహెచ్‌వో మంగళవారం సందర్శించారు. ఈ సంధర్భంగా గర్భిణీల ఆరోగ్య సేవలను పరిశీలించారు. గర్భిణీల నమోదు, పరీక్షలు, హైరిస్క్ గర్భిణీల గుర్తింపు, రిఫరల్ సేవలు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలపై సమీక్షించారు. సంబంధిత రికార్డులను, సిబ్బంది హాజరు వివరాలను తనిఖీ చేసి, సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు ఆరోగ్య, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్, డిపిఎమ్ఓ మోహన్, సంబంధిత ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# పన్నులు పెంచలేదు అప్పులు తీరుస్తూనే ఇందిరమ్మ రాజ్యం నడిపిస్తున్నాం

* **డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : పన్నులు పెంచకుండానే అప్పులను తీరుస్తూ ఇందిరమ్మ రాజ్యాన్ని నడిపిస్తున్నామని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క అన్నారు మంగళవారం భువనగిరిలో 11 కోట్ల వ్యయంతో విద్యుత్తు అభివృద్ధి పనులకు బట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్ల అప్పుల ఊబిలో నెట్టిన వెనకడుగు వేయకుండా ప్రజా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామని అన్నారు కనురెప్పపాటు కరెంటు పోకుండా 28,546 మెగావాట్ల రికార్డు డిమాండ్ ను అధిగమించామని ఆయన అన్నారు. త్వరలోనే కోటి 15 లక్షల కుటుంబాలకు 5 లక్షల ఇందిరమ్మ కుటుంబ బీమా అందిస్తామని అన్నారు. భువనగిరి సర్కిల్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బట్టి విక్రమార్క ప్రసంగించారు రోజుకో అబద్ధం సృష్టిస్తూ కట్టుకథలతో విష ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాల వైఖరి పై నిప్పులు చెరిగారు గత ఎన్నికలకు ముందు పిసిసి అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎల్పీ నేతగా తాను సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అధికారంలోకి వచ్చినాక అమలు చేశాడని ఈ సందర్భంగా ఆయన వివరించారు. బి ఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఉచిత కరెంటు అని ఓట్లు దండుకుంది తప్ప డిస్కములకు నిధులు ఇవ్వకుండా అప్పుల పాలు చేసిందని ధ్వజమెత్తారు గత పాలకులు పెట్టిన బకాయిలను క్లియర్ చేస్తూ రాష్ట్రంలో 30 లక్షల వ్యవసాయ కంపు చెట్లకు అయ్యే విద్యుత్ ఖర్చు 14,000 కోట్లను తమ ఆర్థిక శాఖ ద్వారా ప్రతినెల ప్రణాళిక బద్ధంగా డిస్కములకు చెల్లిస్తున్నామని ఉచిత కరెంటు ఇవ్వడమే కాదు క్వాలిటీ పవర్ స్వరపర చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, టిజి ఎస్పి సిపిఎల్ సిఎండి జితేష్ వి బాటిల్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి వాణి రవికుమార్, తడక వెంకటేశం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఛీ మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

## ఏఎన్ఎంల మూడు నెలల పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

* **సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు లిక్కి బాలరాజు డిమాండ్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీలు) ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పీపీ యూనిట్ లో పనిచేస్తున్న ఏఎన్ఎంలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్న ఆయన, నెలల తరబడి జీతాలు అందక కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ యూనిఫారాలను సొంత ఖర్చులతో కొనుగోలు చేయాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు.ప్రభుత్వమే యూనిఫాం అలవెన్స్ మంజూరు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పని భద్రత కల్పించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను సక్రమంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా పనులు మాత్రమే చేయించుకుంటున్నారని విమర్శించారు.మూడు నెలలుగా జీతాలు అందకపోయినా జిల్లా అధికారులు స్పందించకపోవడం వల్ల ఏఎన్ఎంలు ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేసి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, యూనిఫాం అలవెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, సోనియా, అనితశ్రీ, సమ్మక్క, భవాని జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి

* **ఆర్టీసి ని ప్రభుత్వంలో వెంటనే విలీనం చేయాలి.**
* **ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న డిమాండ్.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి కార్మికులను ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విలీన ప్రక్రియను ప్రారంభించాలని ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. మంగళవారం నాడు హుస్నాబాద్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టిసి కార్మికుల్లో నెలకొన్న విలీనమా లేక యూనియన్ ఎన్నికల అనే గందరగోళానికి తక్షణమే తెరదించాలని ఈదురు వెంకన్న సిఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్, సిపిఐ కొహెడ మండల కార్యదర్శి వెల్పుల శ్రీనివాస్ హుస్నాబాద్ ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బిర్సా ముండా స్ఫూర్తితో ఆదివాసి హక్కుల కోసం పోరాటం చేయాలి

* **గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గుగులోత్ కిషన్ నాయక్**



మహబూబాబాద్ ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు దళిత గిరిజన ప్రజా సంఘాలతో ఆదివాసి పోరాటాలకు స్ఫూర్తి దాత బిర్సా ముండా వర్ధంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ వర్ధంతి సభలో కిషన్ నాయక్ మాట్లాడుతూ ఈ దేశంలో ఆదివాసుల అస్తిత్వం కోసం జల్, జంగిల్, జమీన్ అడవిపై సర్వ హక్కులు ఆదివాసులకే ఉండాలని బ్రిటిష్ దోపిడి పాలకుల వ్యతిరేకంగా ఆదివాసుల విముక్తి కోసం గెరిల్లా మార్గంలో పోరాటం నిర్వహించి బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన గొప్ప విప్లవ జ్యోతి బిర్సా ముండాని. బిర్సామండ ఆశయంతో ఆదివాసిలకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులను, చట్టాలను రక్షణ కోసం పోరాటాలకు ఆదివాసులు, గిరిజనులు సిద్ధం కావాలని కిషన్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల చిత్తారి సోమన్న, కేయుపిఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డల రామ్మూర్తి,గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు భాను వెంకన్న, డిఎస్ఎఫ్ పోలేపాక వెంకన్న,యాదవ సంఘం నాయకులు గణేష్ ,గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంగోత్ కిషన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైన 12 మంది కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

* **జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన కిష్టాపూర్ పాఠశాల**



ప్రజాస్ఫూర్తి , జన్నారం : 202526 విద్యా సంవత్సరానికి గాను జాతీయ ఉపకార వేతనాలకు జన్నారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిష్టాపూర్ కు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న తెలిపారు. కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు భారత ప్రభుత్వం అందించే జాతీయ ఉపకార వేతనాలకు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీ పరీక్షల చివరి ఫలితాల్లో ఎన్ఎంఎంఎస్ లో కిష్టాపూర్ విద్యార్థులు విజయ దంకా మోగించారని, జిల్లా మొత్తంలో 57 మంది విద్యార్థులకు గాను కిష్టాపూర్ ఉన్నత పాఠశాల నుంచే 12 మంది విద్యార్థులు ఎంపికై జిల్లాలోనే మొదటి స్థానాన్ని, ఉమ్మడి జిల్లాలో రెండో స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. జాతీయ ఉపకార వేతనాలకు ఎన్నికైన వారిలో ముత్యం అహన్విత వర్మ, జక్కుల మనీష్, కర్నే శ్రీకృతి, జాడీ నవదీప్,కుదురుపాక ఉదయ్ చరణ్, చెట్పల్లి ఆరాధ్య, నక్క విష్ణు,ఉడతల ఉదయ్, తేజావత్ ఋషి వర్ధన్, పోతు ఋషి ,వాసాల శ్రీహర్ష, చాట్ల రిషి వర్ధన్ లు ఉన్నారు. వీరు ప్రతి సంవత్సరముకు 12 వేల రూపాయల ఉపకార వేతనం నాలుగు సంవత్సరాల వరకు భారత ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు ఈ పాఠశాల నుండి జాతీయ ఉపకార వేతనాలకు 300 మంది విద్యార్థులు ఎంపికై జాతీయస్థాయి రికార్డు సృష్టించిందని తెలిపారు. ఎంపికైన 12 మంది విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, మండల విద్యాధికారి విజయకుమార్, గ్రామ సర్పంచ్ వాసాల నరేష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంగ, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఈతను పాఠ్యాంశంలో చేరుస్తామని ప్రకటించడంతో మంత్రికి ఘన సన్మానం



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ఈతను పాఠ్యాంశంలో చేరుస్తామని ప్రకటన చేసినందుకు సామాజిక పర్యావరణ వేత్త కోల రవీందర్ ముదిరాజ్ మంగళవారం క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ని కలిసి కర్రతో చేసిన చేప బొమ్మను ఇస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా పోరాటం పాఠ్యాంశంలో చేర్చాలని 25 ఏళ్లుగా అన్ని ప్రభుత్వాలకు విన్నవించినానని, ,అతను స్పందిస్తూ ఇది తప్పనిసరిగా క్యాబినెట్ మీటింగ్ లో పెట్టి ముఖ్యమంత్రితో చర్చించి పాఠ్యఅంశంలో చేర్చే విధంగా చేస్తానని అన్నారు. ఆ వెంటనే సంబంధిత అధికారులకు క్రీడా శాఖ వారికి, విద్యాశాఖ వారికి,ఫోనులో మాట్లాడి ఈ ఒక సబ్జెక్టును జరగబోయే క్యాబినెట్ మీటింగ్ లో అందివ్వాలని,సంబంధిత అధికారులకు,ఆర్డర్ ఇవ్వడం జరిగిందన్నారు. పాఠ్య అంశంలో చేర్చడానికిహామీ ఇస్తున్నాను మొన్ననే మా నియోజకవర్గంలోని నలుగురు పిల్లలు ఈత,రాక,సాధన అని తెలియక,చనిపోవడం జరిగింది, తమరు, రవీందర్ ముదిరాజ్ చేస్తున్నటువంటి ఈ యొక్క పోరాటాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకున్నాను తమరు, సేకరిస్తున్నటువంటి ఈ యొక్క డాటాను నేను, చూసి అభినందిస్తున్నాను అని నన్ను షాలువతో సన్మానించారు,నీ వద్ద ఇంకేదైనా సమాచారం, ఉంటే నాకు అందించవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి మాజీ కార్పొరేటర్,సర్పంచ్ ఆగం పాండు, రాబోలు,జితేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థిక సాయం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని జయపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన రెండు కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన మందుల నర్సయ్య, మందుల ముత్తయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించి, ఓదార్చారు.అన్ని వేళ్ళలో మీ కుటుంబాలకు తోడుగా ఉంటామని, అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీల బియ్యంతో పాటు, నిత్యావసర వస్తువులు, ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షులు చుక్క వెంకన్న, గ్రామ సర్పంచ్ రేణుక అశోక్ రెడ్డి,ఉప సర్పంచ్ చుక్క వేణు, నాయకులు నెలకుర్తి వెంకటరెడ్డి, బొల్లం వాసు,రాచమల్ల భద్రయ్య,బాల్లె ఐలయ్య,లింగారెడ్డి, రవీందర్ రెడ్డి, రాచమల్ల వెంకన్న, చుక్క మధుసూదన్, నకెరకంటి నాగరాజు, చుక్క అశోక్,మందుల రాంమ్మూర్తి,దారం మల్లయ్య,చుక్క శ్రీకాంత్,మందుల నరేష్,చుక్క వెంకన్న, మందుల వెంకన్నలు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

* **రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార - పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి అశ్వారావుపేట నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. దమ్మపేట మండలంలోని కట్కూరు, వీరభద్రునిగుంపు, పట్వారిగూడెం, మద్దులగూడెం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. పట్వారిగూడెం గ్రామంలో రాజుపల్లి గ్రామానికి చెందిన 38 మంది డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. అనంతరం రూ.2.22 కోట్ల వ్యయంతో పట్వారిగూడెం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుండి పాకలగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, రూ.1.93 కోట్లతో మొద్దులగూడెం ఆర్ అండ్ బి రోడ్డు నుండి రెడ్డాలపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా కొమరం భీమ్ అర్బన్ ఎకో పార్క్ నిర్మాణ పనులకు, రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మామిళ్లవారిగూడెం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేవలం తొమ్మిది నెలల్లోనే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల వ్యయంతో రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేసినట్లు తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గానికి ప్రత్యేకంగా 4,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ అంకిత్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, అశ్వారావుపేట మునిసిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, ఆత్మ కమిటీ చైర్మన్,ప్రజాప్రతినిధులు, నిర్మాణ శాఖ పిడి సావేరామ్,జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వండి

* **మేడ్చల్ జిల్లా డీఈఓ కు టి యు డబ్ల్యూ జే నాయకుల విజ్ఞప్తి**



మేడ్చల్, ప్రజాస్ఫూర్తి : జర్నలిస్టుల పిల్లలకు పాఠశాలల్లో 50 శాతం రాయితీ కల్పించేలా ప్రభుత్వ యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ( టి యు డబ్ల్యూ జే ఐజేయు) మేడ్చల్ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంగళవారం జిల్లా విద్యాధికారి (డిఈఓ) రేణుకా దేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. 202627 విద్యా సంవత్సరానికి గాను జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు రాయితీ ఇచ్చేలా తగు సూచనలతో ఆదేశాలు జారీ చేయాలని కోరారు . దీనిపై సానుకూలంగా స్పందించిన డిఇఓ వెంటనే తగు ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎవరైనా జర్నలిస్టులు తమ పిల్లలకు ఫీజు రాయితీ కోరుతూ ఆయా పాఠశాలల పేరుమీద వ్యక్తిగతంగా లెటర్ కావాలనుకునేవారు నేరుగా జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్ లోని విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే( ఐజేయు ) రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్, జిల్లా కార్యదర్శి దొంతుల వెంకట్రాంరెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, జిల్లా జర్నలిస్టు నాయకులు రామారావు, ప్రసాద్, భూపాల్, నరోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కక్కిరేణి చంద్రశేఖర్ నియామకం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సుధా బ్యాంకు వైస్ చైర్మన్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు కక్కిరేణి చంద్రశేఖర్ తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మంగళవారం నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మినారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కక్కిరేణి చంద్రశేఖర్ మాట్లాడుతూ నాపై నమ్మకముతో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యక సభ్యులుగా నియమించిన అమరవాది లక్ష్మీనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఆర్యవైశ్యుల అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా నియామకమైన సందర్భంగా పలువురు ఆర్య వైశ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# ఘనపూర్‌లో రూ.60.62 కోట్ల విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రూ.60.62 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు విద్యుత్ అభివృద్ధి పనులకు సంబంధించిన నూతన సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలోరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యుత్ వ్యవస్థను నిరంతరం ఆధునీకరిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా నవీకరణలు చేపడుతున్నామని చెప్పారు. ఈ క్రమంలో నే విద్యుత్ రంగంలో అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నామని వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరా వ్యవస్థ తో పాటు ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం వివిధ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తోందన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం పేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తోందని తెలిపారు.. శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ, కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు వల్ల రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయి లో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రఘునాథపల్లి 132/33 కేవీ సబ్‌స్టేషన్ ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులకు నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, రైతులు, ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. టీజీఎన్‌పీడీసీఎల్ సీ.ఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ,రూ.60.62 కోట్ల వ్యయంతో ఘనపూర్ నియోజకవర్గంలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రారంభించడం ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. లోడ్ మేనేజ్‌మెంట్ మెరుగుపడి ప్రజలకు నిరంతర విద్యుత్ అందుతుందని చెప్పారు. ట్రాన్స్‌కో అధికారులు కూడా విద్యుత్ రంగ అభివృద్ధి కార్యక్రమాలను అభినందిస్తూ, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్విని రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, కోఆపరేటివ్ చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందచేత



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి సహకారంతో మంగళవారం మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలం, కాచనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రామన్నపేట గ్రామానికి చెందిన సురభాక లింగరాజుకు 60,000 వేల రూపాయలు సీఎం రిలీఫ్ పండ్ చెక్కును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కాచనపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పర్శిక రాజు, ఎస్.కె యూసఫ్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు కార్పొరేట్ వైద్యానికి అయ్యే ఖర్చు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కొంతవరకు పేద ప్రజలకు ఉపయోగపడుతుంది. ఆర్థిక పరమైన ఇబ్బందులతో గురవుతున్న ప్రతి పేదవారికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పర్శిక రాజు, ఎస్.కె యూసఫ్,అల్లేం రామ్ ,పర్శిక రామ్, పంజాల రాజేష్, మెస్సు భద్రయ్య,కోడెం కన్నయ్య,సురబాక జగ్గన్న, బిజ్జా నరేష్, తాటి కృష్ణ గ్రామ పెద్దలు ముఖ్య నాయకులు ఎమ్మెల్యేకు,కాంగ్రెస్ ప్రభుత్వనికి,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## హాస్టల్ల మరమ్మత్తులు వెంటనే పూర్తి చేయాలి: కలెక్టర్



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : పాఠశాలల పునః ప్రారంభంలోపే పాఠశాలలు, హాస్టళ్లలో చిన్న చిన్న మరమ్మతులు పూర్తిచేసి సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, అనుముల మండలం కేంద్రం హాలియాలో పలు విద్యాసంస్థలను, హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను తనిఖీ చేసి సిహెచ్ సి ప్రారంభోత్సవానికి అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బంది తదితర విషయాలపై జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ మాతృతో చర్చించారు. వైద్య పరికరాల నిమిత్తం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 65 లక్షల రూపాయల మంజూరు చేసిన విషయాన్ని డాక్టర్ మాతృ కలెక్టర్ కు వివరించారు. సాధ్యమైనంత త్వరగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవానికి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కేజీబీవీని తనిఖీ చేసి కేజీబీవీలో టాయిలెట్లు, తాగునీటి వసతి వంటివి సిద్ధం చేయాలని, పాఠశాల ప్రారంభం నాటికి చిన్నచిన్న రిపేర్ పనులన్నీ పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్రావును ఆదేశించారు. పక్కనే ఉన్న ఎస్సీ, బీసీ బాలికల హాస్టళ్లను కూడా జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఎస్ సి గర్ల్స్ హాస్టల్లో మరమ్మత్తు పనులు పరిశీలించారు. కాగా హాస్టల్లో నీరు నిలువ ఉండడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను పిలిపించి నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే సోక్ పిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బీసీ బాలికల వసతి గృహంలో ఉన్న సౌకర్యాలు ,స్టోర్ రూమ్, డార్మెటరీని తనిఖీ చేశారు. పాఠశాల ప్రారంభమైన వెంటనే విద్యార్థులు హాస్టల్ కు వస్తారని, అందువల్ల పెండింగ్ పనులను పూర్తి చేయాలని, అలాగే అన్ని ప్రభుత్వా హాస్టళ్లలో పాఠశాలల్లో, కలరింగ్ తో పాటు, సున్నం వేయించాలని, టాయిలెట్ బ్లాకులు, తాగునీటి వసతి ఉపయోగం లోకి తీసుకురావాలని సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ శశికళను ఆదేశించారు.అలాగే జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల తనిఖీ సందర్భంగా పాఠశాల ఆవరణలో చేపట్టిన తాగునీటి ట్యాంకు నిర్మాణం మధ్యలో ఆగిపోగా జిల్లా కలెక్టర్ స్పందించి మిషన్ భగీరథ ఇంజనీరింగ్ పిలిపించి తక్షణమే వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.డిగ్రీ కళాశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ వెంకటేశ్వర్లు, టీఎస్ ఎం ఐ డి సి డిప్యూటీ ఇంజనీర్ తదితరులు ఉన్నారు.

## ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీ, సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని తెలిపారు.పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంపొందించేలా ప్రతి ఒక్కరూ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

## గంజాయి మత్తులో జీవితాలు చిత్తు చేసుకోవద్దు

**: జిల్లా ఎస్పీ డా. శబరీష్.**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : గంజాయి రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా మంగళవారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ , టౌన్ సీఐ రఘుపతి రెడ్డి, పోలీస్ సిబ్బందితో కలిసి మహబూబాబాద్ పట్టణంలోని సిగ్నల్ కాలనీలో పర్యటించారు. ప్రజలకు, ముఖ్యంగా యువతకు గంజాయి వల్ల కలిగే అనర్థాల గురించి అక్కడి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన పోస్టర్లను స్వయంగా ఎస్పీ విడుదల చేసి, కాలనీలోని గోడలకు అతికించడం జరిగింది. గంజాయి వాడకం వల్ల మెదడు దెబ్బతినడం, ఆలోచనా శక్తి తగ్గడం, శ్వాసకోశ సమస్యలు, డిప్రెషన్ వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తాయని, ఇది చదువు, ఉద్యోగం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎస్పీ డా. శబరీష్ వివరించారు.గంజాయిని గుర్తించే విధానం,అంటే ఎండిన ఆకులు, పువ్వులు లేదా మొక్క భాగాల రూపంలో ఉండి, 57 దంతాల అంచులను కలిగి, ప్రత్యేకమైన ఘాటైన వాసనతో ఉంటుందని పోస్టర్ల ద్వారా ప్రజలకు తెలియజేశారు. గంజాయికి సంబంధించిన ఎటువంటి అనుమానాస్పద సమాచారం ఉన్నా, వెంటనే 8712656999 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని, సరైన సమాచారం అందించిన వారికి 5,000 రూపాయల వరకు బహుమతి అందజేయబడుతుందని ప్రకటించారు.






## తెలంగాణ ఉద్యమకారుల సమావేశం విజయవంతం చేయండి

* **ఉద్యమకారుల ఎంపిక పారదర్శకంగా జరగాలీ**

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మాజీ మంత్రి కేశవ రావు ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయడం స్వాగతించదగిన నిర్ణయమని మెదక్ జిల్లా తెలంగాణ జేఏసీ సమన్వయకర్తలు సడిమెల యాదగిరి,బి. కొండల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియపై చర్చించేందుకు జూన్ 10న సాయంత్రం 5 గంటలకు మెదక్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్ లో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయినవారు, శారీరకంగా వికలాంగులైనవారు, ఉద్యమానికి సంబంధించి కేసులు ఎదుర్కొన్నవారు, జైలు శిక్ష అనుభవించిన వారిని గుర్తించేందుకు ప్రాతిపదికలను రూపొందించిందని చెప్పారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, సబ్బండ వర్గాల ప్రజలు సహా అన్ని వర్గాల ప్రజలు పాల్గొని రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అందువల్ల జిల్లాలో జరిగిన ఉద్యమ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నవారందరినీ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మెదక్ మండలం, పట్టణం, హవేలీ ఘనపూర్, పాపన్నపేట, కొల్చారం, వెల్దుర్తి మండలాలకు చెందిన ఉద్యమకారులందరూ జూన్ 10న సాయంత్రం 5 గంటలకు టీఎన్జీవో భవన్‌లో జరిగే సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని మెదక్ జిల్లా ఉద్యమ జేఏసీ సమన్వయ కమిటీ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో శంకర్ దయాల్ చారి, బొందుగుల నాగరాజు, పీడీ ఆనందం, భూపాల్ రెడ్డి, కుమార్ మామిడి, బొమ్మల మైసయ్య, ఆకుల పెంటయ్య, కంది శ్రీనివాస్ రెడ్డి, సత్యం మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ విజయవంతం చేయాలి

**: డీఎంహెచ్‌వో**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : గర్భిణీ స్త్రీలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి తల్లి, శిశు మరణాలను తగ్గించడమే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ లక్ష్యమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. మంగళవారం రేగొండ పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణీలకు రక్తపోటు, రక్తహీనత, రక్తం-మూత్ర పరీక్షలు, గర్భస్థ శిశు పెరుగుదల అంచనా, అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ సేవలు అందించారు. హైరిస్క్ గర్భిణీలను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 237 మంది గర్భిణీలకు పరీక్షలు నిర్వహించగా, 46 మంది హైరిస్క్ గర్భిణీలను గుర్తించి వైద్య సేవలు అందించారు. గర్భిణీలు తప్పనిసరిగా మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ కార్డుతో వచ్చి కనీసం నాలుగు ఏఎన్‌సీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఈ సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ హిమబిందు, సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## ఫ్లైఓవర్ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి

* **సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్**



గచ్చిబౌలి , ప్రజాస్ఫూర్తి : ఐఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అధికారులకు సూచించారు. గచ్చిబౌలి పరిధిలోని ఐఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను మంగళవారం శేర్లింగంపల్లి ఏడీసీపీ హనుమంతరావు, సిఎంసి అధికారులతో కలిసి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ నుండి డీఎల్ఎఫ్ జంక్షన్ వరకు చేపడుతున్న ఫ్లైఓవర్ , రహదారి విస్తరణ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు.అనంతరం నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ మాట్లాడుతూ గచ్చిబౌలి పరిధిలోని నిర్మాణ పనుల దృష్ట్యా రాబోయే మూడు నెలల పాటు ప్రత్యేక ట్రాఫిక్ అడ్వైజరీ అమలు చేసి, అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని కోరారు.రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం గచ్చిబౌలి-డీఎల్ఎఫ్ మార్గంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని సీపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ సురేష్, సిఎంసి అధికారులు , ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ షాపులలో విస్తృత తనిఖీలు

* **నకిలీ విత్తనాలు, అధిక ధరల విక్రయాలపై కఠిన చర్యలు.**
* **హుస్నాబాద్ ఎస్సై, పి. లక్ష్మారెడ్డి**




హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ ఎస్సై పాకాల లక్ష్మారెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా డీలర్లకు పలు సూచనలు జారీ చేశారు. రైతులకు నాణ్యమైన సన్న రకం వడ్ల విత్తనాలు అందుబాటులో ఉంచాలని నకిలీ విత్తనాల విక్రయం లేదా ఎరువులు,పురుగుమందులు విత్తనాలను అధిక ధరలకు విక్రయించినట్లయితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా ప్రతి షాపులో స్టాక్ బోర్డులను స్పష్టంగా ప్రదర్శించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు పురుగుమందులు,విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ నిబంధనలను ఉల్లంఘించే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వారి లైసెన్సులను కూడా రద్దు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# మద్యం తాగితే శరీరంలో ఏం జరుగుతుంది ?

మద్యం తాగడాన్ని ఒక సరదాగా ప్రారంభించి, దానిని ఒక అలవాటుగా మార్చుకుంటూ ఉంటారు. అయితే మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరం అని డాక్టర్లు పదే పదే చెబుతున్నారు. మద్యం సేవించడం వల్ల అనేక తీవ్రమైన నష్టాలు మన ఆరోగ్య విషయంలో వస్తాయని హెచ్చరిస్తున్నారు. మరి అవేమిటో ప్రస్తుతం మనం తెలుసుకుందాం.



మద్యపానం కారణంగా ఎముకల బలహీనత .. సెక్స్ సామర్థ్యం తగ్గుదల అధికంగా మద్యాన్ని తీసుకోవడం వల్ల ఎముకల బలహీనత వస్తుంది. క్యాల్షియం మరియు విటమిన్ డి శరీరంలో సరిగా పనిచేయకుండా పోతాయి. కీళ్లలో నొప్పి, కాళ్లలో నొప్పి వంటి సమస్యలు పెరుగుతాయి.అధికంగా మద్యం తీసుకోవడం వల్ల సెక్స్ సామర్థ్యం తగ్గుతుంది. వీర్యకణాల నాణ్యత పడిపోతుంది. ఫలితంగా సంతానలేమి సమస్య కలుగుతుంది. మద్యపానంతో తీవ్ర నష్టాలు.. జాగ్రత్త కాబట్టి ఇన్ని అనర్థాలకు కారణం అయ్యే మద్యాన్ని అధికంగా సేవించడం మానుకోవాలి. పూర్తిగా మానేసిన ఎలాంటి ఇబ్బంది ఉండదు. తరచూ మద్యం సేవించే వాళ్ళు ఈ విషయాలు తెలుసుకుని, ఈ ప్రమాదాలను అర్థం చేసుకొని తదనుగుణంగా మద్యం సేవించడాన్ని కంట్రోల్ చేసుకోవాలి.



మద్యం సేవించటం వ్యసనం అయితే ప్రాణాలకే ప్రమాదం . చాలామంది సంతోషకర సమయమైనా, విచారకర సమయమైనా మద్యం సేవించడానికి ఇష్టపడతారు. మొదట సరదా.. తర్వాత అలవాటుగా.. ఆపై వ్యసనంగా మారుతుంది. అలా మద్యం సేవించడం వ్యసనంగా మారితే అది ప్రాణాల మీదకు తెస్తుంది. అతిగా మద్యం సేవించే అలవాటు ఉంటే త్వరితగతిన దానిని మానుకోవలసిన అవసరం ఉంది. ఎదం టే ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ఎంతో నష్టపోక తప్పదు.

మద్యం సేవించటం వ్యసనం అయితే ప్రాణాలకే ప్రమాదం . చాలామంది సంతోషకర సమయమైనా, విచారకర సమయమైనా మద్యం సేవించడానికి ఇష్టపడతారు. మొదట సరదా.. తర్వాత అలవాటుగా.. ఆపై వ్యసనంగా మారుతుంది. అలా మద్యం సేవించడం వ్యసనంగా మారితే అది ప్రాణాల మీదకు తెస్తుంది. అతిగా మద్యం సేవించే అలవాటు ఉంటే త్వరితగతిన దానిని మానుకోవలసిన అవసరం ఉంది. ఎదం టే ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ఎంతో నష్టపోక తప్పదు.

### మద్యపానం కారణంగా లివర్, ప్యాంక్రియాస్ కు ప్రమాదం

తరచూ మద్యం ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయం తీవ్రంగా దెబ్బతింటుంది. ఎక్కువ ఆల్కహాల్ తాగడం వల్ల లివర్ ఫెయిల్యూర్ అవుతుంది. కాలేయం వాపు సమస్య కూడా వచ్చే అవకాశం ఉంటుంది. ప్యాంక్రియాస్ అనేది ఇన్సులిన్ మరియు ఇతర రసాయనాలు ఉత్పత్తి అయ్యే శరీరంలోని అవయవం. మద్యపానం వల్ల ఇది ఎఫెక్ట్ అవుతుంది. ఇది ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ కు కూడా దారితీస్తుంది. క్యాన్సర్, డయాబెటిస్, గుండె జబ్బుల ప్రమాదం మద్యం ఎక్కువ సేవించడం వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. మద్యాన్ని తీసుకోవడం వల్ల ప్యాంక్రియాస్ లో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గుతుంది. అటువంటి పరిస్థితిలో రక్తంలో చక్కెరస్థాయిలు పెరుగుతాయి. ఫలితంగా మధుమేహం సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది. నేషనల్ హార్ట్ అసోసియేషన్ చెప్పిన వివరాల ప్రకారం ఆల్కహాల్ గుండె ఆరోగ్యానికి హాని చేస్తుంది. ఆల్కహాల్ ఎక్కువ సేవించే వారిలో రక్తంలో కొవ్వు స్థాయిలు పెరిగి, హార్ట్ స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది.

### హ్యాంగోవర్ ఎందుకు ఏర్పడుతుంది?

ఈ విషయంపై ఇప్పటి వరకు జరిగిన పరిశోధనలను పరిశీలించినప్పుడు హ్యాంగోవర్ లక్షణాలకు వివిధ కారణాలు కనిపించాయి. వీటిలో మొదటిది నిర్జలీకరణం అంటే డీ హైడ్రేషన్.శరీరంలో సహజంగా ఏర్పడే రసాయన పదార్థాల సాంద్రత (కాన్సంట్రేషన్)ను ఆల్కాహాల్ తగ్గిస్తుంది. ఎక్కువ మొత్తంలో మద్యం తీసుకోవడం వల్ల ఇది ఏర్పడుతుంది. ఇలా తీసుకోవడం వల్ల రక్తంలో ఇథనాల్, దాని డీకంపోజిషన్ ఉత్పత్తుల సాంద్రత పెరుగుతుంది.అయితే, ఈ హ్యాంగోవర్ ఈ మార్పుల కారణంగానే ఏర్పడిందా అన్న మాత్రం స్పష్టం కాలేదు. దీని మీద ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ అసౌకర్యాన్ని కొందరు పరిశోధకులు వ్యాధి నిరోధకతతో ముడి పెట్టారు. మద్యం తీసుకున్నప్పుడు నొప్పి, మంటకు సంబంధించిన కొన్ని పదార్థాలు విడుదలవుతాయని, దీనివల్ల హ్యాంగోవర్ వంటి అసౌకర్యం ఏర్పడుతుందని భావించారు.

# కార్బన్ డై ఆక్సైడ్‌ను నిర్మూలించవచ్చా?






పర్యవరణ మార్పల నుంచి భూమిని రక్షిండం కోసం మొక్కను పెంచడం అనేది అందరికి తెలిసిన సాదాహారణ విషయం . అయితే ప్రపంచ అడవులను కాపాడటానికి వాటికి మరింత భద్రత కల్పించాలని, నరికిన వృక్షాలని తిరిగి నాటాలని సందేశం ఇస్తూ పర్యావరణ పరిరక్షక ప్రచారకురాలు గ్రెటా థన్‌బర్గ్ ఒక చిత్రాన్ని కూడా నిర్మించారు.ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షక ప్రచారకర్తలు పర్యావరణం కోసం రకరకాల ప్రచారాలను నిర్వహిస్తున్నారు.గత దశాబ్దంలో బ్రిటన్ ప్రభుత్వం కొన్ని కోట్ల మొక్కలు నాటింది. 2016లో భారతదేశంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఒక్క రోజులోనే 5 కోట్ల మొక్కలు నాటారు. ఇథియోపియా ఒకే రోజులో 35 కోట్ల మొక్కలు నాటినట్లు ప్రకటించుకుంది.ప్రస్తుతం ఉన్న అడవులని కాపాడుకుంటూ కొత్త వాటిని నాటడం మంచిదే. అయితే, పర్యావరణ పరిరక్షణ కోసం పూర్తిగా మొక్కల మీదే ఆధారపడకూడదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

వృక్షాలు పర్యావరణ సంరక్షణకు సహకరిస్తాయి. కానీ, వాటంతట అవే వాతావరణ పునర్నిర్మాణానికి సహకరించవంటూ చాలా మంది ఈ వాదన పట్ల విమర్శలు చేశారు.గతంలో ఎన్నడూ లేనంతగా వాతావరణంలోకి గ్రీన్‌హౌస్ వాయువులు ముఖ్యంగా కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అవుతుండటం వలన వాతావరణంలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరిగిపోతున్నాయి.దీంతో ఐస్ షీట్లు కరగడం, సముద్ర మట్టాలు పెరగడం, హరికేన్లు సంభవించడం, కరువు పెరగడం జరుగుతోంది. గ్రీన్‌హౌస్ వాయువులని వాతావరణంలోకి విడుదల చేయడం పూర్తిగా ఆపగలగడమే ఒక పరిష్కారం.

ఉదాహరణకి ఫాసిల్ (బొగ్గు, గ్యాస్ తరహా) ఇంధనాల వాడకానికి బదులు సోలార్ శక్తి ద్వారా నడిచే పరికరాలు వాడటం ఒక మార్గం.అడవులని నిర్మూలించడం ద్వారా వాతావరణంలోకి అత్యధిక శాతంలో కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అవుతుంది.2017లో ప్రపంచ వ్యాప్తంగా 41 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అయితే అందులో 4 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ అడవుల నిర్మూలన కారణంగా చోటు చేసుకుంది. చెట్లు నరకడం ఆపితే ఏటా విడుదల అయ్యే వ్యర్థాలలో 10 శాతం తగ్గించవచ్చుఅయితే ఇప్పటికే చాలా వినాశనం జరిగింది. గాలిలోంచి కార్బన్ డై ఆక్సైడ్‌ని నిర్మూలించడానికి సరైన మార్గాలు కనిపెట్టాల్సి ఉంది.ఇందుకోసం శాస్త్రవేత్తలు చాలా రకాలైన సాంకేతిక మార్గాలని ప్రతిపాదించారు. కానీ, వృక్షాలు కార్బన్ డై ఆక్సైడ్ గ్రహించడంలో ముఖ్యమైన పాత్రని పోషిస్తాయి. అయితే కొత్త మొక్కలు నాటడం కానీ, లేదా కొత్తగా అడవులని అభివృద్ధి చేయడం కానీ చేయాలి. చెట్టు సజీవంగా ఉన్నంతవరకు గాలిలో కార్బన్ డై ఆక్సైడ్‌ని అవి పట్టి ఉంచుతాయి.

ఇందుకోసం ముఖ్యంగా అమెజాన్ లాంటి అడవులని నాశనం చేయడం ఆపాలి.ప్రపంచంలో ఇంకా 0.9 బిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో అడవులని పెంచేందుకు అవకాశం ఉందని 2019లో స్విట్జర్లాండ్‌కి చెందిన థామస్ క్రౌథర్ నిర్వహించిన ఒక అధ్యయనం పేర్కొంది.ఈ అడవులు అభివృద్ధి చెందితే 752 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్‌ని గాలిలోంచి తీసుకోగలవని ఈ అధ్యయనం తెలిపింది.అయితే, ఈ అధ్యయనం ఇతర పర్యావరణ శాస్త్రజ్ఞుల నుంచి విమర్శలు ఎదుర్కొంది. చెట్లు నిల్వ ఉంచగలిగే కార్బన్ డై ఆక్సైడ్ శాతంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.క్రౌథర్ విడుదల చేసిన అధ్యయనంలో చెట్లు నాటడానికి అందుబాటులో ఉన్నట్లు చెప్పిన స్థలంలో ఇప్పటికే చెట్లు ఉన్నాయని విమర్శించారు. వీటిని అక్టోబర్ 2019లో ఒక సైన్స్ పత్రిక ప్రచురించింది.




### వాతావరణ సమస్యలు ఎదుర్కోవడానికి చెట్లు ఎంతవరకు ఉపయోగపడతాయి?

సహజ రీతుల్లో వాతావరణాన్ని పరిరక్షించాలంటే వెట్‌ల్యాండ్స్ (చిత్తడి నేలలు)ని సంరక్షించడం, ఇతర పరిరక్షక పద్ధతులని అవలంబించడం, పంట పొలాల నుంచి విడుదలయ్యే వ్యర్థాలని తగ్గించడం లాంటివి చెయ్యాలని 2017లో నిర్వహించిన ఒక అధ్యయనం పేర్కొంది. సహజ విధానాలను పాటించడం ద్వారా ప్రతి ఏటా 23.8 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్‌ని బంధించి ఉంచుతాయని తెలిపింది. వాతావరణం విషయంలో అనిశ్చితి అయితే ఉంటుంది. వాతావరణం అనుకోని రీతిలో మార్పులకి లోనవుతూ ఉంటుంది.దీంతో చెట్లు పెరిగే తీరులో మార్పులు చోటు చేసుకుంటాయి.



# రసం పొడి.. సింపుల్‌గా ఇలా తయారుచేసుకోండి..

ఎన్ని వెరైటీలతో భోజనం లాగించినా .. చివర్లో రసంతో ఓ నాలుగు ముద్దలు పడితేనే చాలా మందికి భోజనం పరిపూర్ణమవుతుంది. కేవలం రసం కోసం భోజనం చేసే వారూ ఉంటారు. ముఖ్యంగా దక్షణభారతదేశంలో రసం కు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు.. అయితే రుచికరంగా రసం తయారు చేయడం అంత ఈజీ కాదు. బాగా తలలు పండిన మన అమ్మొమ్మలు, బామ్మలు మాత్రమే టెస్టీగా రసం తయారు చేస్తారు. ఇక రసం రుచిగా ఉండాలంటే రసం పొడి తయారుచేసుకోవడం ఎంతో ముఖ్యం. అసలు రసం పొడి ఎలా తయారుచేసుకోవాలా ఇప్పుడు చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు**

- ఎండుమిర్చి - 15
- మిరియాలు - పావు కప్పు
- కందిపప్పు - పావు కప్పు
- జీలకర్ర- పావు కప్పు
- ధనియాలు - ఒక కప్పల
- కరివేపాకులు - ఐదు రెబ్బలు



### రసం పొడి ఇలా తయారు చేసుకోండి..

ముందుగా స్టవ్ మీద కళాయి పెట్టి ధనియాలు వేసి వేయించాలి. వీటిని చిన్న మంట మీద వేయిస్తే బాగా వేగుతాయి. తర్వాత జీలకర్ర, కందిపప్పు, మిరియాలు, ఎండుమిర్చి కూడా వేసి వేయించాలి. చివరిలో నాలుగు కరివేపాకు రెమ్మలు వేసుకోవాలి. ఇవన్నీ చల్లారాక మిక్సీ జార్లో వేయాలి. ఒక టేబుల్ స్పూన్ పసుపు, అర స్పూన్ ఇంగువ కూడా వేసి అన్ని మెత్తగా పొడిలా చేసుకోవాలి.. దీన్ని గాలి చొరబడని ఒక డబ్బాలో వేసి ఫ్రిజ్లో పెట్టుకోవాలి.. ఆరు నెలల వరకు ఇది తాజాగా ఉంటుంది. దీంతో చారు చేసుకుంటే చాలా తాజాగా, చాలా టేస్టీగా ఉంటుంది.



### పొడిలో ఆరోగ్యప్రయోజనాలు

ఈ చారు పొడిలో ముఖ్యమైన పదార్థాలు ధనియాలు, జీలకర్ర, కందిపప్పు. ఈ మూడింటి వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ధనియాలలో ఉండే ఔషధ గుణాల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అనేక చర్మ సమస్యలను తగ్గించడంలో ధనియాలు ముందుంటాయి. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. దీనిలో యాంటీ హైపర్ గ్లెసిమిక్ లక్షణాలు ఎక్కువ. కాబట్టి మధుమేహ రోగులు కచ్చితంగా ధనియాలను ఆహారంలో భాగం చేసుకోవాలి. చారు పొడిలో ఈ ధనియాలు ఎక్కువ శాతం ఉంటాయి కాబట్టి దీంతో ప్రతిరోజు రసం చేసుకుంటే మంచిది. జీలకర్రను కూడా ఇందులో వినియోగించాం, దానివల్ల గుండె సమస్యలు రాకుండా ఉంటాయి. బీపీ, షుగర్ అదుపులో ఉంచుతుంది. కొన్ని రకాల చర్మ సమస్యలు, అలెర్జీలను రాకుండా అడ్డుకుంటుంది. కందిపప్పు తినడం వల్ల ప్రొటీన్లు పుష్కలంగా అందుతాయి. ఈ పప్పుతో ఫైబర్, క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. జ్ఞాపకశక్తిని పెంచేందుకు కూడా ఇది ఔషధంలా పనిచేస్తుంది.



# MOVIE TIME



## శ్మశానాల పక్కన వైన్స్ పెట్టండి

- సీఎం విజయ్‌తో చెప్పిన పార్తిబన్

శ్మశానాల పక్కన వైన్స్ షాప్స్ ఏర్పాటుచేస్తే బాగుంటుందని కోలీవుడ్ సీనియర్ నటుడు పార్తిబన్ అన్నారు. సీఎం విజయ్‌ని కలిసినప్పుడు ఇదే విషయాన్ని ఆయనతో చెప్పానని వెల్లడించారు. వీరిద్దరి మీటింగ్‌పై పుకార్లు పుట్టుకురావడంతో ఆయన క్లారిటీ ఇచ్చారు. "తాగుడు మానేయమని ప్రజలకు ఎన్ని రకాలుగా చెప్పిన ఎలాంటి ఉపయోగం ఉండదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మద్య పాన సమస్య పరిష్కారం కావడం లేదు. అందుకే శ్మశానాల, విద్యుత్ దహన వాటికల సమీపంలో వైన్స్ షాప్స్ ఏర్పాటు చేయమని విజయ్‌తో చెప్పాను. ఆ శ్మశానాలను చూసైనా ఎక్కువ తాగితే తొందరగా ఇక్కడికి రావాల్సి వస్తుందనే భయంతో కొంతమందైనా తాగుడు మానేస్తారు అని పార్తిబన్ చెప్పుకొచ్చారు. దీంతో ఆయన కామెంట్లు తమిళనాట వైరల్ అవుతోన్నాయి.



## ట్రంప్‌తో ప్రజాస్వామ్యానికి పెను ముప్పు

- ఓటు హక్కు కొందరికే ఉండాలి
- ఆర్జీవీ సంచలన ట్వీట్

సంచలనాలకు కేరాఫ్ అడ్రస్ అయిన టాలీవుడ్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన స్టైల్‌లో రెచ్చిపోయారు. ఈసారి ఏకంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను, అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న 'ప్రజాస్వామ్య' వ్యవస్థను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "ట్రంప్ వల్లే ప్రజాస్వామ్యానికి మరణశాసనం". ట్రంప్ లాంటి వ్యక్తులు అధికారంలోకి రావడం ప్రజాస్వామ్యానికే పెను ముప్పు. మెజారిటీ ప్రజలు ఓటు వేశారు కాబట్టే ట్రంప్ ప్రెసిడెంట్ అయ్యారు. కానీ గుంపులో ఉండే మెజారిటీ ఎప్పుడూ 'స్మార్ట్' కాదు. ఒక కార్పొరేట్ కంపెనీలో సీఈవోను వర్కర్లు కాకుండా బోర్డ్ మెంబర్స్ ఎలా ఎంచుకుంటారో.. దేశ పాలనలోనూ చదువుకున్న వారికే ఓటు హక్కు ఉండాలి. ఇండియాలోనూ డబ్బు, మద్యం ఇచ్చి నాయకులు ఓట్లు కొంటున్నారు. ఓటర్లకు పొలిటికల్ సైన్స్‌లో కనీస విద్యార్హతలు ఉండాలి అని ఆర్జీవీ అభిప్రాయపడ్డారు. ఆయన చేసిన కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.

## సారా మూవీ.. డైరెక్ట్‌గా ఓటీటీలోకి

ధురంధర్ హీరోయిన్ సారా అర్జున్ నటించిన తెలుగు మూవీ మ్యాజిక్ థియేటర్లను స్కిప్ చేస్తూ నేరుగా ఓటీటీలో రిలీజ్ కాబోతుంది. ధురంధర్ కంటే ముందే తెలుగులో మ్యాజిక్ పేరుతో సారా అర్జున్ ఓ సినిమా చేసింది. హీరోయిన్‌గా అంగీకరించిన ఫస్ట్ మూవీ ఇది. గతేడాదే షూటింగ్ పూర్తికాగా అనివార్య కారణాల వల్ల రిలీజ్ డిలే అవుతూ వచ్చింది. తాజాగా నేరుగా ఓటీటీలో రిలీజ్ చేయాలని మేకర్స్ ఫిక్సయ్యారట. నెట్‌ఫ్లిక్స్‌తో డీల్ ఒకే అయినట్లు తెలిసింది. త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానున్నట్లు చెబుతోన్నారు. జూలైలో ఈ మూవీ రిలీజయ్యే అవకాశం ఉందని అంటున్నారు. మ్యూజికల్ డ్రామాగా రూపొందిన ఈ మూవీకి జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించాడు. అనిరుధ్ మ్యూజిక్ అందించాడు.





## డైరెక్టర్‌గా నిత్యా మీనన్

టాలీవుడ్ సీనియర్ హీరోయిన్ నిత్యా మీనన్ త్వరలోనే డైరెక్టర్‌గా ఎంట్రీ ఇవ్వబోతుంది. ఫ్యామిలీ థ్రిల్లర్ కథతో డెబ్యూ మూవీ చేయనున్నదట. ఇందులో విజయ్ సేతుపతితో కలిసి నిత్యానే నటిస్తున్నదట. ఇటీవల ఓ సినిమా ప్రమోషన్స్‌లో ఈ విషయాన్ని తమిళ డైరెక్టర్ పాండిరాజ్ రివీల్ చేశాడు. ఆమె ఇప్పటికే రెండు కథలను సిద్ధం చేసుకుంది. నిత్యా రైటింగ్ స్కిల్స్ బాగుంటాయి. ఎలాంటి ఎమోషన్‌ను అయినా అద్భుతంగా రాయగలదు. కెమెరా ముందే కాదు తెర వెనుక ఏం జరుగుతుందనే విషయంలోనూ ఆమెకు అవగాహన ఉంది. దర్శకురాలిగా ఆమె పేరును స్క్రీన్‌పై త్వరలోనే చూడబోతున్నాం" అంటూ పాండిరాజ్ చెప్పాడు. దీంతో అతడి కామెంట్లు వైరల్ అవుతోన్నాయి.

## పెద్దిలో ఆ సీన్లు కట్..

- త్వరలో స్క్రీనింగ్ కానున్న రీ సెన్సార్ వెర్షన్

రామ్‌చరణ్ పెద్ది మూవీని మేకర్స్ రీ సెన్సార్ చేయబోతున్నారట. ఆడియెన్స్ నుంచి వస్తోన్న విమర్శలను దృష్టిలో పెట్టుకొని సెకండాఫ్‌లోని కొన్ని సీన్లను డిలీట్ చేయబోతున్నారట. సెకండాఫ్‌లో కుస్తీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కొన్ని సీన్లు బోర్‌గా ఉన్నాయని ఆడియెన్స్ నుంచి కంప్లైంట్స్ వస్తున్నాయట. ముద్దు సీన్లతో పాటు జాన్వీ ఎన్నికల ప్రచారం సీన్లను కట్ చేయనున్నట్లు వార్తలొస్తున్నాయి. కొత్త సీన్లను సినిమాకు యాడ్ చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. రీ సెన్సార్ వెర్షన్ బుధవారం లేదా గురువారం నుంచి థియేటర్లలో స్క్రీనింగ్ కానున్నట్లు సమాచారం.



## సన్నీ లియోన్‌కు నోటీసులు

బాలీవుడ్ హాట్ బ్యూటీ సన్నీ లియోన్ ఓ భారీ ఆర్థిక వివాదంలో చిక్కుకున్నది. కర్నాటకలో వెలుగుచూసిన దాదాపు రూ.2,400 కోట్ల అక్రమ డిపాజిట్స్ స్కామ్‌లో ఆమె పేరు వెలుగులోకి రావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. 'శివమ్ అసోసియేట్స్' అనే సంస్థ చట్టవిరుద్ధంగా ప్రజల నుంచి భారీగా డిపాజిట్లు సేకరించి మోసాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఈ సంస్థ యజమాని శివానంద నీలణ్ణవర్‌పై ఇప్పటికే కేసులు నమోదు కాగా.. విచారణలో భాగంగా కర్నాటక సీఐడీ అధికారులు సన్నీ లియోన్‌కు నోటీసులు జారీ చేశారు. కన్నడ సినీ రంగానికి చెందిన నటులు 'డాలి' ధనుంజయ్, సప్తమీ గౌడ (కాంతార ఫేమ్), వశిష్ఠ సింహ, రాగిణి ద్వివేదిలకు కూడా త్వరలో నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమంగా సేకరించిన సొమ్ము వినియోగంపై దర్యాప్తు కొనసాగుతుండడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.